
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



బాపట్ల జిల్లా వార్తలు

5

బుధవారం 6 ఆగస్టు 2025



అమృతలూరు గ్రామంలోని రేషన్ షాపు



మృతులకూ.. రేషన్

కార్డుల్లో తొలగించని పేర్లు

- ప్రహసనాన్ని తలపిస్తోన్న ఈ-కేవైసీ
- అనర్హులు లబ్ధి పొందుతున్నా పట్టని అధికారులు

రేషన్ సరుకులు.. అర్హులకు మాత్రమే అందాలి. అయితే అధికారుల నిర్లక్ష్యం కారణంగా సరుకుల పంపిణీలో గోల్‌మాల్‌తో పాటు ప్రజాధనం పెద్దమొత్తంలో వృథా అవుతోంది. జిల్లాలో రేషన్ లబ్ధిదారుల్లో మృతులు ఉన్నారంటే ఆశ్చర్యం కాదు. ఇక ప్రభుత్వ ఉద్యోగులు, ఆర్థికంగా స్థితిమంతులు, పెళ్లి చేసుకుని వెళ్లిపోయిన వారు.. ఇలా ఎందరో ఇప్పటికీ రేషన్ కార్డుల్లో ఉన్నారు. వీరందరూ నెలనెలా ఠంచనుగా రేషన్ సరుకులు పొందుతుండటంతో ప్రభుత్వంపై పెనుభారం పడుతోంది. దీనిని అడ్డుకోవాల్సిన అధికారులు పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఈ-కేవైసీ పక్కాగా అమలు చేస్తే అనర్హులను కార్డుల్లో నుంచి తొలగించవచ్చు. కానీ మూడు నెలలుగా ఈ-కేవైసీ ప్రక్రియను అధికారులు ఓ ప్రహసనంగా మార్చేశారు. ప్రభుత్వం గడువు పొడిగించుకుంటూ వెళ్తుండటంతో ఈ-కేవైసీ నూరు శాతం జరగడంలేదు. ఇదే అవకాశంగా డీలర్లు రేషన్ సరుకులను పక్కదారి పట్టిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

అర్హులకు మాత్రమే రేషన్ ఫలాలు అందడంతో పాటు బియ్యం పక్కదారి పట్టడానికి వీలులేదన్నది ప్రభుత్వ లక్ష్యం. అయితే క్షేత్రస్థాయిలో ఇందుకు పూర్తి విరుద్ధంగా పరిస్థితులు ఉంటున్నాయి. ఈ-కేవైసీ ప్రక్రియ నత్తనడకనే సాగుతుండటంతో అర్హత లేకపోయినా పలువురు లబ్ధి పొందుతున్నారని సమాచారం. ప్రజాధనం వృథాకు అడ్డుకట్ట పడాలంటే ఈ-కేవైసీతో పాటు క్షేత్రస్థాయి సర్వేతోనే సాధ్యపడుతుందనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నా.. అధికారులు పట్టించుకోవడంలేదన్న విమర్శలు వస్తున్నాయి. అర్హులకు లబ్ధి చేకూరడం ఎంత ముఖ్యమో అనర్హుల ఏరివేత కూడా పక్కాగా ఉండాలని పాలకులు చెప్తున్నా క్షేత్రస్థాయిలో అధికారులు పట్టించుకోవడంలేదు. గత ప్రభుత్వం అనర్హుల ఏరివేతపై దృష్టి పెట్టకపోగా.. ప్రస్తుతం కూడా అదే పరిస్థితి నెలకొంది. రాజకీయ సిఫార్సులే ప్రామాణికంగా రేషన్‌కార్డులను ఇబ్బడిముబ్బడిగా జారీ చేయడంతో జిల్లాలో ఇబ్బడిమబ్బడిగా కార్డుదారులు పెరిగిపోయారు. ఏటికేడు

(మిగతా 6లో)

అనర్హులతో రూ.3 కోట్ల వ్యయం

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో దాదాపు రెండున్నర లక్షల మంది అర్హత లేకపోయినా రేషన్ ఫలాలు అందుకుంటున్నట్లు తెలుస్తోంది. దాదాపు 21 వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ప్రభుత్వం మూడు జిల్లాల పరిధిలోని కార్డుదారుల కోసం కేటాయిస్తుంది. ఇందుకు సగటున రూ.వంద కోట్ల వరకు ప్రభుత్వం ఖర్చు పెడుతోంది. కానీ అనర్హులు రేషన్ లబ్ధి పొందుతుండడం వల్ల ప్రభుత్వ ఖజానాకు దాదాపు రూ.3 కోట్లు అదనంగా ఖర్చవుతున్నట్లు తెలుస్తోంది.

విష జ్వరాల నివారణకు చర్యలు

- 51 మందికి పరీక్ష.. ఆరుగురికి పాజిటివ్
- ఈదుపల్లి గ్రామంలో పర్యటించిన కలెక్టర్
- మృతుల కుటుంబాలకు అండ : వెంకటమురళి

రేపల్లె, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో విష జ్వరాల నివారణకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెంకటమురళి తెలిపారు. నగరం మండలం ఈదుపల్లి గ్రామంలో పర్యటించిన కలెక్టర్ ఇంటింటికీ వెళ్లి విషజ్వరాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విష జ్వరాలతో మృతి చెందిన కుటుంబాలకు అండగా నిలుస్తామన్నారు. గ్రామంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపర్చాలని, అవసరమైతే జ్వర పీడితులను గుంటూరు, తెనాలి తరలించి మెరుగైన చికిత్సలు అందించాలని అధికారులను ఆదేశించారు. మురుగుకాల్వల్లో దోమల నివారణ మందు ఫాగింగ్ చేయాలని సిబ్బందికి సూచించారు. విషజ్వరాలు తగ్గేంతవరకు వైద్యసిబ్బంది ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ వారికి మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. ప్రజారోగ్యశాఖ నిర్లక్ష్యం కనిపిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో 51 మందికి జ్వరాలు నిర్వహించగా ఆరుగురికి పాజిటివ్ అని తేలిందన్నారు. డెంగీతో స్థానిక ఆర్ఎంపీ వద్ద చికిత్స పొందారని, నయంకాక పూర్తిగా ముదిరిన తర్వాత తెనాలి, గుంటూరు వెళ్లడంతోనే దంపతులు మృతి చెందారని తెలిపారు. తాగునీరు మురికిగా, అదీ అరకొరగానే వస్తుందని గ్రామస్థులు తెలపడంతో తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రామలక్ష్మి, డీఎంహెచ్‌వో విజయమ్మ, సంక్రమిత వ్యాధుల విభాగం సహాయసంచాలకులు సుబ్రహ్మణ్యేశ్వరి, తహసీల్దారు నాంచారయ్య, ఎంపీడీవో బొర్రా శ్రీను తదితరులు పాల్గొన్నారు.



ఈదుపల్లిలో డెంగీతో చనిపోయిన వారి వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ వెంకటమురళి

బాధితులను ఆదుకోండి : మంత్రి అనగాని

విషజ్వర బాధితులకు తక్షణమే వైద్యసేవలు అందించి వారికి అండగా నిలవాలని మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు. ఈదుపల్లిలో డెంగీ మరణాలపై మంగళవారం మంత్రి ఆరాతీశారు. అధికారులు అప్రమత్తంగా ఉండి విష జ్వరాల కట్టడికి చర్యలు తీసుకోవాలన్నారు. విష జ్వరంతో దంపతుల మృతి బాధాకరమని, వారి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. అధికారులు నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదన్నా రు. గ్రామంలో పారిశుధ్యాన్ని మెరుగుపరిచి ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. విషజ్వరాలు తగ్గేంత వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచనలు పాటించాలన్నారు.

నెర్రలిచ్చిన సాగు నేల

బలిజేపల్లి, నంబర్‌వన్ కాల్వలకు విడుదల కాని నీరు

ఎండుతున్న వెదనాట్లు



చుక్కనీరు రాని బలిజేపల్లి కాల్వ

వేమూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సాగు నిమిత్తంగా ప్రభుత్వం డెల్టా ప్రాంతానికి సాగునీటిని వదిలి 20 రోజులు దాటుతోంది. అయినా వేమూరు మండలం పరిధిలోని బలిజేపల్లి, నంబర్ వన్ కాల్వలకు ఇంత వరకు చుక్క నీరు అందలేదు. దాదాపుగా 1,500 ఎకరాలకు చెందిన రైతులు ఈ రెండు కాల్వలపై ఆధారపడి సాగు చేస్తున్నారు. గతంలో ఈ కాల్వల లెవలింగ్ సరిలేక నీరు అందేది కాదు. ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం రూ.కోటి నిధులు నియోజకవర్గంలోని కాల్వల మరమ్మతులకు విడుదల చేయడంతో.. ఈ రెండు కాల్వల సమస్యకు పరిష్కారం లభించింది. అయినప్పటికీ సాగు నీరు అందకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నంబర్ వన్ కాల్వ కింద అబ్బనగూడవల్లి, బలిజేపల్లి, తాడిగిరిపాడు గ్రామాలకు చెందిన 800 ఎకరాలు.. బలిజేపల్లి కాల్వ కింద అబ్బనగూడవల్లి, పెనుమర్రు, బలిజేపల్లి-తాడిగిరిపాడు - కోడిపర్రు గ్రామాలకు చెందిన 600 ఎకరాలకు సాగుకు నీరు అందక వెద నాట్లు వేసిన రైతులు నానా అవస్థలు పడుతున్నారు. సాగునీరు అందకపోయినా వర్షాల కోసం ఎదురు చూసిన రైతులకు నిరాశే ఎదురైంది.


అడ్డుకట్టలే అసలు సమస్య..

నీటి పారుదల శాఖ ఏఈ రవి ఈ సమస్యపై వివరణిచ్చారు. ప్రధాన కాల్వల్లో సాగునీరు పుష్కలంగా ఉందన్నారు. అయితే.. కాల్వల ప్రథమంలో ఉన్న రైతులు తమ భూములకు నీరు పెట్టుకునేందుకు అడ్డుకట్టలు వేయడం వల్ల సమస్య ఏర్పడిందని చెప్పారు. మంగళవారం ప్రత్యేక చర్యలతో నీటిని వదిలి.. రైతులకు సహకరిస్తామని పేర్కొన్నారు.

ఆలయ భూమిని కాపాడండి

శ్రీవీరాంజనేయస్వామి పేరుతో కరపత్రం

అమృతలూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): దూపదీప నైవే ద్యాల కోసం దాతలు ఇచ్చిన భూమిని కాపాడండి.. అంటూ ఏకంగా ఏలూరు జిల్లా ఏలూరు మండలం చాటపర్రు శ్రీవీ రాంజనేయస్వామి పేరుతో వెలిసిన కరపత్రం అమృతలూరులో చర్చనీయాంశంగా మారింది. 40 ఏళ్ల క్రితం అమృతలూరుకు చెందిన దాత సుశీర్ల సూర్యనారాయణ అనే భక్తుడు ఇచ్చిన 1 ఎకరా 98 సెంట్లకు వచ్చే కౌలుతో ఆలయంలో సేవలు అందుతున్నాయని, ఇప్పుడు ఆ భూమిని కొందరు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారు.. గ్రామస్థులు, ఆలయ అధికారులు కాపాడాలి.. అంటూ స్వామివారి పేరుతో వెలిసిన కరపత్రంలో ఉండటంతో ఆలయ భూమికి రెక్కలొచ్చాయా అని గ్రామస్థులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఏలూరు జిల్లా ఏలూరు మండలం చాటపర్రులోని శ్రీవీరాంజనేయస్వామి ఆలయానికి అమృతలూరులో సర్వే నెంబరు 479/బీలో 1 ఎకరా 98 సెంట్ల దానంగా ఇస్తూ సుశీర్ల సూర్యనా రాయణ వీలునామా రాశారు. కొంతకాలం వరకు చాటపర్రు వీరాంజనేయస్వామి దేవస్థానం అంటూ భూమి శిస్తు కూడా చెల్లించారు. అయితే ఇటీవల ఆ భూమి తమది అంటూ కొందరు గ్రామకచేరి రెవెన్యూ అధికారులను కలిశారు. స్వామికి చెందిన భూమిని దక్కించుకునేందుకే వారు అధికారులను కలిశారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో కరపత్రం వెలుగుచూడటం.. ఆ పొలం చుట్టూ వీరాంజనేయస్వామి జెండాలను నాటడంతో గ్రామంలో చర్చనీయాంశంగా మారింది.



గ్రామంలో పంపిణీ జరిగిన కరపత్రం



జెండాలు పాతిన ఆలయ భూమి

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి

కొరిశపాడు సుపరిపాలనలో మంత్రి రవికుమార్



దివ్యాంగురాలికి ట్రైసైకిల్ పంపిణీ చేస్తున్న మంత్రి రవికుమార్, కలెక్టర్ వెంకటమురళి

మేదరమెట్ల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో రాజకీయలకు అతీతంగా అభివృద్ధి, సంక్షేమం అందిస్తున్నట్లు మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని కొరిశపాడులో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గ్రామంలో రూ.1.66 కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, రూ.2.30 లక్షలతో నిర్మించిన సైడ్ డ్రెయిన్లు, సీసీ రోడ్లను మంత్రి ప్రారంభించారు. ఎస్సీ కాలనీలో రూ.32.50 లక్షలతో నిర్మించిన ఎన్టీఆర్ సుజల స్రవంతి వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతు అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు బాధ్యత తీసుకోవాలన్నారు. తల్లికివందనం, ఉచిత గ్యాస్ పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. కూటమీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 1.10 లక్షల మంది వితంతువులకు పింఛన్లు అందించామన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఒక్క వితంతు పెన్షన్ కూడా ఇవ్వలేదన్నారు. గ్రామంలో ఇప్పటికే 50 లక్షలతో ఎస్సీ కాలనీలో రోడ్లు సైడ్ డ్రెయిన్లు నిర్మించామన్నారు. గ్రా మంలో పాత విద్యుత్ స్థంభాలను తొలగించి 150 కొత్తగా వేశామన్నారు. మరో 20, 30 ఏళ్ల వరకు వెనుతిరిగి చూడకుండా గ్రామాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. రైతులకు అవసరమైన డొంక రోడ్లను కూడా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. అసంపూర్తిగా ఉన్న ప్రాథమిక ఆర్యోగ కేంద్ర భవనాలను వెంటనే పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను మంత్రి ఆదేశించారు. రోగులకు అసౌకర్యం కలగ కుండా వైద్యులు అందుబాటులో ఉండాలన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సామూహిక సీమంతాల కార్యక్రమంలో గర్భిణీలను మంత్రి ఆశీర్వాదించారు.

పదివేల మందికి సైకిళ్లు పంపిణీ చేస్తాం

15 మంది దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, జడ్పీ ఉన్నత పాఠశాలలో 56 మంది విద్యార్థులకు సైకిళ్లను మంత్రి పంపిణీ చేశారు. వచ్చే డిసెంబర్‌లోపు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పది వేల సైకిళ్లు పంపిణి చేస్తామని తెలిపారు. సీఎస్ఆర్ పథకం కింద పారిశ్రామికవేత్తలు, స్నేహితుల సహకారంతో విద్యార్థులకు సైకిళ్లు, దివ్యాంగులకు మూడు చక్రాల మోటర్ సైకిళ్లను అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంకటమురళి, డీఎంహెచ్‌వో విజయమ్మ, ఎంపీపీ సాధినేని ప్రసన్నకుమారి, జడ్పీటీసీ తుళ్లూరి వెంకటరమణ, తహసీల్దార్ సుబ్బారెడ్డి, సర్పంచ్ విజయకుమార్, టీడీపీ నాయకులు ఏడెం భవానిప్రసాద్‌రెడ్డి, సింబోతు సత్యనారాయణ, సొసైటీ చైర్మన్ మున్నంగి వెంకట సుబ్బారెడ్డి, గోలి హరిబాబు, సత్యనారాయణరెడ్డి, మాజీ సర్పంచ్‌లు సురేంద్ర, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పరిహారంపై కసరత్తు

- ఒడిశా కలెక్టర్లతో చర్చిస్తున్న యంత్రాంగం
- క్షతగాత్రులకు నేడు పరిహారం పంపిణీకి చర్యలు

(బాపట్ల, బల్లికురవ, ఆంధ్రజ్యోతి)

బల్లికురవ మండల పరిధిలోని కొణిదెన రెవిన్యూలోని సత్య కృష్ణ గ్రానైట్ క్వారీ మృతులకు నష్ట పరిహారం అందించడానికి యంత్రాంగం కసరత్తు చేస్తోంది. క్వారీలో ఆదివారం ఒడిశాకు చెందిన ఆరుగురు కార్మికులు మృతి చెందిన విషయం తెలిసిందే. వారి మృతదేహాలను స్వస్థలం ఒడిశా రాష్ట్రానికి ఆదివారం రాత్రికే తరలించారు. మృతులకు రూ.14 లక్షల చొప్పున నష్ట పరిహారం ప్రభు త్వం ప్రకటించిన సంగతి విదితమే. మృతుల్లో ఇద్దరు ఒడిశాలోని గజపతి జిల్లాకు చెందిన వారు కాగా, నలుగురు గంజాం జిల్లాకు చెందిన వారుగా గుర్తిం చారు. ఈ క్రమంలో ప్రభుత్వ పరిహారాన్ని ఆయా కుటుంబ సభ్యులకు అందేలా చూడడానికి కలెక్టర్ వెంకటమురళితో పాటు చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు ఒడిశా కలెక్టర్లతో చర్చిస్తున్నారు. మృతుల కుటుంబసభ్యులు, బ్యాంకు ఖాతాల విషయంలో స్పష్టత రాలేదని ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు తెలిపారు. క్వారీల్లో పనిచేసే వారికి పీఎఫ్, అసంఘటిత కార్మికులకు అందించే ఫలాలు అందాలన్నా బ్యాంకు ఖాతాలు తప్పనిసరి. అయితే వారికి బ్యాంకు ఖాతాలు లేవని, ఇందుకు కార్మిక శాఖ ఉదాసీనత కారణమని పలువురు ఆరోపిస్తున్నారు. తీవ్ర గాయాల పాలైన వారిలో ఇద్దరికి పది లక్షల చొప్పున, మిగిలిన ఆరుగురికి ఒక్కొక్కరికి లక్ష చొప్పున పరిహారాన్ని ప్రభుత్వం అందించనుంది. వీరందరూ ప్రస్తుతం నరసరావుపేట ఆస్పత్రిలోనే చికిత్స పొందుతున్నందువల్ల వారికి బ్యాంకు ఖాతాలు తెరిచే ప్రక్రియను యంత్రాంగం దాదాపుగా పూర్తి చేసింది. బుధవారం వారి ఖాతాల్లో పరిహారం జమ చేయనున్నట్లు చీరాల ఆర్డీవో తెలిపారు.

రెండో రోజు విచారణ

క్వారీలో రెండో రోజు మంగళవారం కూడా మైన్స్ అండ్ సేఫ్టీ డిప్యూటీ డైరెక్టర్ జ్ఞానేశ్వర్ విచారణ చేపట్టారు. క్వారీలో భద్రత పరంగా చేపట్టిన చర్యలపై పరిశీలన చేశారు. ప్రమాదం ఎలా జరిగింది. అప్పుడు ఎంత మంది కూలీలు ఉన్నారన్న దానిపై విచారణ చేపట్టారు.

అమరావతి రాయల్స్ జెర్సీ ఆవిష్కరణ

❖ చీరాల సెయింట్ ఆన్స్‌లో కెప్టెన్ హనుమవిహారి సందడి



అమరావతి రాయల్స్ జెర్సీ ఆవిష్కరిస్తున్న కెప్టెన్ విహారి

చీరాల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): వైజాగ్‌లో శుక్రవారం నుంచి జరిగే ఆంధ్రా ప్రీమియర్ లీగ్-2025 క్రికెట్ మ్యాచ్‌లో పాల్గొనున్న అమరావతి రాయల్స్ టీం జెర్సీని కెప్టెన్ హనుమవిహారి ఆవిష్కరించారు. చీరాల సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో మంగళవారం విద్యార్థుల కేరింతల మధ్య ఈ కార్యక్రమం జరిగింది. టీం విజయం సాధించాలని విద్యార్థులతో పాటు అభిమానులు ఆకాంక్షించారు. జట్టుకు మాజీ ఎంఎల్‌సీ అన్నం సతీష్ ప్రభాకర్ ఫ్రాంచైజీగా వ్యవహరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్, మాజీమంత్రి వనమా వెంకటేశ్వరరావు, టీం కోచ్ అబ్రహం, మేనేజర్ హర్షవర్ధన్, సీఈవో యశ్వంత్, కళాశాల సెక్రటరి వనమా రామకృష్ణారావు, కరస్పాం డెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు, రమణమూర్తి, పీడీ అన్నం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సంజీవనిగా..కుయ్..కుయ్..!

- తెలుగు లోగిళ్లను తలపించేలా..
- అంబులెన్స్‌లకు కొత్త రూపు

ఉపాధి మేతకు.. కృత్రిమ మేధతో చెక్.!

- దొంగ మస్టర్ల నివారణకు.. ముఖ ఆధారిత హాజరు

అమృత్ స్టేషన్లలో పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

- దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ

8

ఇదెట్లా..!

పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ లబ్ధిదారుల్లో వ్యత్యాసం


అన్నదాత సుఖీభవ ఇది రాష్ట్ర ప్రభుత్వ పథకం.. పీఎం కిసాన్ ఇది కేంద్ర ప్రభుత్వ పథకం. రెండు పథకాల లక్ష్యం ఒక్కటే అన్నదాతకు పెట్టుబడి సాయం అందించడం. ఇంత వరకు బాగానే ఉంది. లబ్ధిదారుల ఎంపికలో రెండు పథకాలకు పొంతన లేదు. ఒక పథకం జాబితాలో ఉన్న లబ్ధిదారులు.. మరో పథకం జాబితాలో లేరు. పీఎం కిసాన్ పథకం కింద రూ.2 వేలు నగదు జమ అయిన అన్ని ఖాతాలకు.. అన్నదాత సుఖీభవ సొమ్ము రూ.5 వేలు జమ కాలేదు. ఇదే పరిస్థితి అన్నదాత సుఖీభవ పథకం లబ్ధిదారులది. పీఎం కిసాన్‌లో అర్హత ఉంటే.. సుఖీభవకు ఎలా అనర్హులం అవుతామంటూ.. బాధితులు ప్రశ్నిస్తున్నారు. సుఖీభవ పొందిన తమకు.. పీఎం కిసాన్ ఎందుకివ్వరని సదరు రైతులు నిలదీస్తున్నారు. ఇలాంటి లబ్ధిదారులు వందల్లో ఉంటే ఎక్కడో పొరపాటు జరిగిందని భావించవచ్చు. ఈ సంఖ్య వేలల్లో ఉంది.

అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ లబ్ధిదారుల వ్యత్యాసం ఇలా..

జిల్లా	అన్నదాత సుఖీభవ (లబ్ధిదారులు)	పీఎం కిసాన్ (లబ్ధిదారులు)	వ్యత్యాసం
పల్నాడు	2,39,959	2,02,278	37,681
బాపట్ల	1,60,441	1,43,200	17,241
గుంటూరు	1,02,650	88,708	13,942

- రెండు కేంద్ర, రాష్ట్ర పథకాలు.. లక్ష్యం రైతుకు పెట్టుబడి సాయం
- కేంద్ర జాబితాలో ఉన్న లబ్ధిదారులు.. రాష్ట్ర జాబితాలో లేరు
- రూ.5 వేలు పడిన వారికి రూ.2 వేలు పడలేదు..
- రెండు పథకాల మధ్య తేడా 68,864 వేల మంది రైతులు





(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాల్లో.. ఒక దానికి లబ్ధి చేకూరి, మరో పథకం వర్తించని రైతులు.. రైతు సేవా కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కానీ, వారి సందేహాలను నివృత్తి చేసే వారు కానరావడం లేదు. రెండు పథకాలకు ఒకే లబ్ధిదారుల జాబితా లేదని అధికారులు చెప్పకనే చెబుతున్నారు. పీఎం కిసాన్

(మిగతా 6లో)



క్రీడాదినోత్సవ పోటీలకు 7న ఎంపికలు

గుంటూరు (క్రీడలు) ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఈ నెల 29న జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని 7వ తేదీ జిల్లాస్థాయి క్రీడా ఎంపికలను నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి పి.నరసింహారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిభను చూపిన క్రీడాకారులను త్వరలో జరగనున్న జోనల్ పోటీలకు పంపనున్నట్లు పేర్కొన్నారు. 22 ఏళ్లలోపు క్రీడాకారులకు మొత్తం పది క్రీడాంశాల్లో వివిధ ప్రాంతాల్లో పోటీలకు జరుగుతాయని తెలిపారు. క్రీడాంశాలకు సంబంధించి సూచించిన క్రీడా శిక్షకులను సంప్రదించాలని పేర్కొన్నారు. హాకీ-శివారెడ్డి 80965 31992(ఏఎన్‌యూ), ఆర్చరీ గోపీ 94419 47974(డీఎస్ ఏ స్టేడియం పొన్నూరు) బ్యాడ్మింటన్, బాక్సింగ్ లోహిత్ 81443 96583(బీఆర్ స్టేడియం,గుంటూరు) బాస్కెట్ బాల్ సుకన్య 78932 94806(అంకిరెడ్డిపాలెం) కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, శివాజీ 98497 03144(టీజేపీఎస్) వెయిట్ లిఫ్టింగ్ గోపి 93922 57919(డీఎస్ఏ స్టేడియం,తెనాలి)లను సంప్రదించాలని తెలిపారు. క్రీడాకారులు ఆధార్, వయసు ధ్రువీకరణ, రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలతో ఎంపికలకు హాజరు కావాలని పేర్కొన్నారు.

బోఫోర్స్ కంటే పెద్ద స్కామ్: ప్రత్తిపాటి

చిలకలూరిపేట, ఆగస్టు5 (ఆంధ్రజ్యోతి): జగన్ మద్యం స్కాం బోఫోర్స్ స్కాం కంటే చాలా పెద్దదని చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజల ప్రాణాలే పెట్టుబడిగా వ్యాపారం చేసి కోట్లు దోచేసిన వారు నిస్సిగ్గుగా అమాయకులమంటున్నారని తెలిపారు. ప్రజారోగ్యానికి ప్రాధాన్యమిచ్చే చంద్రబాబుకు, విషపూరిత మద్యంతో ప్రాణాలు తీసిన జగన్‌కు మధ్య వ్యత్యాసాన్ని ప్రజలు తెలుసుకోవాలని పేర్కొన్నారు. మద్యం సహా ల్యాండ్, శాండ్, సిలికా, క్వార్ట్జ్ ఇలా ప్రకృతి సంపదను, ప్రజల, ప్రభుత్వ ఆస్తుల్ని యథేచ్ఛగా దోచేసిన జగన్, ఆయన పార్టీ నేతలు ఇప్పటికీ చింతచచ్చినా పులుపు చావలేదన్నట్టే మాట్లాడుతున్నారని తెలిపారు. మద్యం కుంభకోణం నిందితులు ఒక్కొక్కరు పట్టుబడుతున్నా.. సిట్ విచారణలో రోజుకో కొత్త కుట్రకోణం వెలుగుచూస్తున్నా వారు అమాయకుల్లా.. నటిస్తూ తమపై కక్ష సాధింపులకు పాల్పడుతున్నారని దుష్ప్రచారం చేస్తున్నారని తెలిపారు.

తీవ్ర జ్వరంతో మహిళ మృతి

నాదెండ్ల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాతులూరు గ్రామానికి చెందిన కూరపాటి మల్లేశ్వరి అనే మహిళ తీవ్ర జ్వరంతో మృతి చెందింది. మూడు రోజుల క్రితం అనారోగ్యంతో ఆమెతో పాటు భర్త పుల్లయ్య నరసరావుపేట పట్టణంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నారు. చికిత్స అందిస్తున్న తరుణంలో శ్వాస సంబంధిత సమస్య రావడంతో మల్లేశ్వరిని మరో వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తుండగా సోమవారం రాత్రి ఆమె మృతి చెందింది. ఈ విషయాన్ని గ్రామస్తులు జిల్లా వైద్య శాఖ అధికారి దృష్టికి తీసుకు వెళ్లారు. దీంతో ఆయన నరసరావుపేటలోని ప్రైవేట్ ఆస్పత్రిని సందర్శించారు. అవయవాలు దెబ్బతినటం వల్ల ఆమె మృతి చెందిందని జిల్లా వైద్య శాఖ అధికారి గ్రామానికి చెందిన బండారుపల్లి సత్యనారాయణకు వివరించారు. ఈ విషయం పై వైద్యాధికారి సాయి శ్వేతను వివరణ కోరగా ఆమె వారం రోజులుగా జ్వరంతో బాధ పడుతూ గ్రామంలోని ఆర్ఎంపీ వద్ద చికిత్స పొందుతుందని, వైరల్ ఫీవర్‌తో చని పోయిందని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి

రాజుపాలెం, ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): గుటూంరు-మాచర్ల రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి.. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు మంగళవారం మృతి చెందాడు. మండలంలోని గణపవరం గ్రామానికి చెందిన రాపల్లి బాబు(35) వ్యతిగత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై పిడుగురాళ్ల వెళ్లి తిరిగి వస్తున్నాడు. మార్గం మధ్యలోని అనుపాలెం సమీపంలోకి వచ్చేసరికే ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు అతివేగంతో వచ్చి ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన బాబును చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేర్పించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్సై వేణుగోపాల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తక్కెళ్లపాడు కల్యాణ మండపం వ్యవహారంలో..

ఎమ్మెల్యే నరేంద్ర తప్పేం లేదు

● గ్రామస్తులంతా వెళ్లి ఆయనకు వివరిస్తేనే పరిష్కారం చేసుకోమని చెప్పారు

● కల్యాణ మండపం యజమాని రాంబాబు వెల్లడి



విలేకరుల సమావేశంలో ప్రసంగిస్తున్న తక్కెళ్ళపాడు టీడీపీ నాయకులు

పెదకాకాని, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): తక్కెళ్లపాడు కల్యాణ మండపం వ్యవహారంలో ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ తప్పేం లేదని, గ్రామస్తులంతా వెళ్లి ఆయనకు వివరిస్తేనే పరిష్కారం చేసుకోమని చెప్పారని పెదకాకాని మండలం తక్కెళ్లపాడు తెలుగుదేశం పార్టీ నాయకులు తెలిపారు. ఆంధ్రజ్యోతి రాష్ట్ర ప్రధాన సంచికలో ఈ నెల 3న "వామ్మో.. ఆ ఎమ్మెల్యే.. దందాలతో దడ " అనే శీర్షిక కథనం వెలువడిన విషయం తెలిసిందే. మంగళవారం దీనిపై తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన బ్యాంక్ ఆక్షన్ వ్యవహారంపై.. కల్యాణ మండప యజమాని మోపర్తి రాంబాబు విలేకరుల సమావేశం నిర్వహించి, పూర్వాపరాలను వివరించారు. తక్కెళ్ళపాడు గ్రామంలో తనకు చెందిన ఎకరం పొలంలో గ్రామంలోని పెద్దలు, మిత్రుల సలహా మేరకు 2019లో కల్యాణ మండపం నిర్మించడం జరిగిందన్నారు. ఆ కల్యాణ మండపం నిర్మించే సమయంలో కెనరా బ్యాంక్ గుంటూరు బ్రాడీపేట బ్రాంచ్‌లో రుణం తీసుకోవడం జరిగిందన్నారు. తదుపరి కరోనా విపత్తులో ఎలాంటి కార్యక్రమాలు జరగకపోవడంతో.. కల్యాణ మండపానికి సంబంధించిన బ్యాంకు కిస్తీలు సరిగా చెల్లించలేక.. బ్యాంకు ఆక్షన్ పెట్టడం జరిగిందన్నారు. ఈ ఆక్షన్‌లో బ్యాంకు సిబ్బంది.. సుబ్బారావు అండ్ టీంతో కుమ్మక్కయి తక్కువ మొత్తానికి కోట్ చేసి.. సుమారు రూ.3 కోట్ల ఆస్తిని రూ.1.80కోట్లకు వేలంలో దక్కించుకున్నట్లు తెలిపారు. అతి తక్కువకే కోట్ చేయడంతో బ్యాంకు అధికారులను సంప్రదించి తాను రూ.40 లక్షల బకాయిల చెల్లిస్తానని, ఆక్షన్ ఆపమని కోరినప్పటికీ.. తన మాట వినకుండా.. పాటదారులతో కుమ్మక్కు అవడంతో.. ఆక్షన్ నిర్వహించారని పేర్కొన్నారు. దీంతో తాను ఆత్మహత్యా యత్నం చేయగా కుటుంబ సభ్యులు అడ్డుకొని మిత్రులకు, గ్రామ పెద్దలకు తెలియజేయగా.. వారందరూ కలిసి పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్‌ని కలవడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే నరేంద్ర బ్యాంక్ ఆక్షన్ పాడుకునే వారితో మాట్లాడటం జరిగిందన్నారు. బ్యాంక్ ఆక్షన్ వారు భీమవరానికి చెందిన వారిగా గుర్తించి.. ఆ ఏరియాకు చెందిన మాజీ ఎమ్మెల్యే, ఏపీఐఐసీ ఛైర్మన్ రామరాజుని సంప్రదించి ఈ విషయాన్ని పరిష్కరించాలని కోరినట్లు చెప్పారు. అప్పు ఇచ్చిన బాధితులు గ్రామస్తులుతో కలిసి తాను రామరాజు ఆధ్వర్యంలో ఏపీఐఐసీ ఆఫీస్ నందు ఆక్షన్ పాడుకున్న వారితో మాట్లాడగా.. తాము ఆక్షన్‌లో పాడిన రూ. 1.80 కోట్లకు అదనంగా రూ.40 లక్షలు ఇస్తే తప్పుకుంటామని అంగీకారం తెలిపినట్లు వెల్లడించారు. ఆ తరువాత తాను ఆ మొత్తం వారికి చెల్లించి సమస్యను పరిష్కరించుకుందామని చూడగా రామరాజు అందుబాటులో లేక కొన్ని రోజులు గడవడం జరిగిందన్నారు. తరువాత ఆక్షన్ పాడుకున్నటువంటి సుబ్బారావు అండ్ టీం వారు ఏపీ ఐఐసీ ఛైర్మన్ రామరాజు మాట కూడా వినకుండా.. అడ్డం తిరిగి పాట పాడిన నగదు అదనంగా.. మరో రూ.కోటి 50 లక్షలు ఇస్తే తప్పుకుంటామనిమని పేచీ పెట్టారని తెలిపారు. తాను మరొక ప్రయత్నంగా మండల పార్టీ నాయకులు తక్కెలపాడు, ఉప్పలపాడు గ్రామ నాయకులు అందరం కలిసి విజయవాడలోని ఓ హోటల్లో ఆక్షన్‌లో పాడిన సుబ్బారావు అండ్ టీం ని కలసి అదనంగా రూ.60 లక్షల వరకు ఇస్తామని అడిగినా.. అంగీకరించ లేదని తెలిపారు. కల్యాణ మండపాన్ని ఆనుకొని ఉన్న స్థలాన్ని తీసుకోమని తాము కోరగా.. ఆ స్థలం విలువ రూ.రెండు కోట్ల 50 లక్షలు ఉంటే వారు కేవలం రూ. 50 లక్షలకే అడిగారని తెలిపారు. ఈ ప్రయత్నాలన్నీ ఫలించకపోవటంతో శ్రేయోభిలాషుల సలహా మేరకు డీ ఆర్‌టీకి వెళ్లగా, దానికి సంబంధించి వాయిదా జరుగుతూ ఉందని తెలిపారు. ఈ సమావేశంలో తక్కెళ్ళపాడు గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ మోపర్తి వేణు కుమార్, ఉప్పలపాడు ఎంపీటీసీ సభ్యులు మోపర్తి శ్రీనివాసరావు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి బుల్లెట్ సుశీల్ రావు, మాజీ ఎంపీటీసీ మోపర్తి సంజీవ్, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు నందిపాటి ప్రసాద్, గ్రామపార్టీ అధ్యక్షులు ఆలపాటి సంపత్, లీగల్ సెల్ నాయకులు వలివేటి నాగేశ్వరావు, భైరపనేని లక్ష్మీనారాయణ, మాచవరపు మల్లికార్జునరావు, అయినంపూడి లింగయ్య, కాకర్ల సురేష్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉత్తమ సొసైటీలుగా పెదకాకాని, నూజెండ్ల



జ్ఞాపిక అందుకుంటున్న పెదకాకాని సొసైటీ కార్యదర్శి



అవార్డు అందుకుంటున్న నూజెండ్ల సొసైటీ ఛైర్‌పర్సన్

గుంటూరు సిటీ/నూజెండ్ల ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): విజయవాడలో జరిగిన ఆప్కాబ్ 62వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పెదకాకాని, నూజెండ్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు అవార్డులు దక్కాయి. గుంటూరు జిల్లాలోని పెదకాకాని పీఏసీఎస్‌కు 2023-2024లో రైతులకు మెరుగైన సేవలు, ఆర్థికంగా లాభాలు ఆర్జించినందుకు అవార్డు దక్కినట్లు సొసైటీ కార్యదర్శి మొవ్వా వెంకటేశ్వరరావు తెలిపారు. ఉత్తమ పీఏసీఎస్‌గా నూజెండ్ల సొసైటీ అవార్డును సొసైటీ ఛైర్‌పర్సన్ బచ్చు అంజిరెడ్డి, సీఈవో గంగినేని శ్రీనివాసరావు అందుకున్నారు. వ్యవసాయ శాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను అందజేశారు.

పచ్చని కుటుంబాన్ని విచ్ఛిన్నం చేసిన విషజ్వరం

● గంటల వ్యవధిలో భార్యాభర్తల మృతి
● అనాథలుగా మిగిలిన ఇద్దరు చిన్నారులు
● విషాదంలో ఈదుపల్లి గ్రామం



ఇద్దరు చిన్నారులు



చిన్నారులతో సుబ్బారావు, మహాలక్ష్మీ (ఫైల్‌పొటో)

రేపల్లె, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): విషజ్వరాలతో దంపతులు మృతి చెందడంతో ఒక్కసారిగా ఈదుపల్లి గ్రామం ఉలిక్కిపడింది. నియోజకవర్గంలోని నగరం మండలం ఈదుపల్లి గ్రామానికి చెందిన తుమ్మల సుబ్బారావు కొన్ని రోజులుగా జ్వరంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందాడు. సుబ్బారావు అంత్యక్రియలైన కొద్ది గంటల్లోనే అతని భార్య మహాలక్ష్మి జ్వరంతో సోమవారం మృతి చెందింది. దీంతో వారి ఇద్దరు కుమార్తెలు అనాథలయ్యారు. తల్లిదండ్రులు చనిపోవడంతో చిన్నారుల రోదన గ్రామస్తులకు కంటతడిపెట్టించాయి. చిన్న వయసులోనే ఇంత పెద్ద కష్టం వచ్చిందంటూ..బాధపడ్డారు. ఈదుపల్లి గ్రామ పాఠశాలోనే ఇద్దరు చిన్నారులు రెండు, మూడు తరగతులు చదువుతున్నారు. రోజుల వ్యవధిలోనే తల్లిదండ్రులు మృతి చెందిన చిన్నారులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు. మంగళవారం గ్రామంలో పరిస్థితులను తెలుసుకునేందుకు వచ్చిన కలెక్టర్ వెంకటమురళికి కుటుంబ సభ్యులు ఇదే విషయమై విజ్ఞప్తి చేశారు.

తగ్గుముఖం పట్టిన వరద

● నిలిచిపోనున్న పడవల రాకపోకలు



కృష్ణానదిలో పడవలో రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులు

కొల్లూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : కృష్ణానది వరద తగ్గుముఖం పట్టింది. మంగళవారం ఎగువ నుంచి వస్తున్న వరద నీటి ప్రవాహం బాగా తగ్గిపోవడంతో కొల్లూరు మండలంలోని గాజుల్లంక నుంచి కృష్ణా జిల్లా శ్రీకాకుళం పడవ ప్రయాణ రాకపోకలు నిలిచిపోనున్నాయి. ఎగువ నుంచి నీటి విడుదల ఆగిపోవడంతో ప్రకాశం బ్యారేజీ నుంచి కూడా దిగువకు నీటి ప్రవాహన్ని పూర్తిగా తగ్గించారు. దీంతో సోమవారం రాత్రి నుంచే కృష్ణా నదికి వరద నీరు క్రమేపీ తగ్గుతూ వస్తోంది. వరద ప్రారంభం నుంచి తెనాలి, కొల్లూరు, భట్టిప్రోలు పరిసర ప్రాంత ప్రజలు గాజుల్లంక నుంచి కృష్ణా జిల్లాకు వెళ్లేందుకు పడవలపై ప్రయాణిస్తున్నారు. బుధవారం నుంచి పడవల ప్రయాణం ఉండకపోవచ్చునని యజమానులు చెబుతున్నారు. అయితే 10 గేట్ల నుంచి నీటి విడుదల జరుగుతుందని కొంత సమాచారం ఉందని, ఆ నీరు వస్తే మరికొన్ని రోజులు పడవల ద్వారా ప్రయాణికులను దాటవేస్తామని పేర్కొంటున్నారు. లేని పక్షంలో కృష్ణా జిల్లాకు పెనుమూడి వారధి మీదుగా వెళ్లాల్సి వస్తుంది. దీంతో ప్రయాణం కాలం పెరగడంతో పాటు దూరభారం కూడా పెరుగుతుందని ప్రయాణికులు చెబుతున్నారు.

బ్యారేజీ దిగువకు 2,900 క్యూసెక్కులు

తాడేపల్లి టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల తగ్గడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి స్వల్పంగా కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు ప్రధాన వాగుల నుండి 19,878 క్యూసెక్కుల వరదనీరు మంగళవారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతున్నట్టు నీటిపారుదల శాఖ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజీ రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటి మట్టం కొనసాగుతుండగా 4 గేట్లను 1 అడుగు మేర ఎత్తి దిగువకు 2,900క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అలాగే తూర్పు డెల్టాకు 10,278 , పశ్చిమ డెల్టాకు 7713, గుంటూరు చానల్‌కు 200 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్టు జేఈ తెలిపారు.

పంచాయతీ కార్యదర్శుల..పదోన్నతి ప్రక్రియ ప్రారంభం

● గ్రేడ్ -1, 2 కార్యదర్శుల సీనియార్టీ జాబితా సిద్ధం



సమావేశం లో మాట్లాడుతున్న జడ్పీ సీఈఓ జ్యోతి బసు

గుంటూరు సిటీ, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పంచాయతీ కార్యదర్శుల పదోన్నతి ప్రక్రియ ప్రారంభమయ్యింది. అందులో భాగంగా గ్రేడ్-1, 2 పంచాయతీ కార్యదర్శుల సీనియార్టీ జాబితాను రూపొందించేందుకు మంగళవారం అధికారులు గుంటూరు జిల్లా పరిషత్‌లో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. జిల్లా పరిషత్ సీఈఓ వీర్ల జ్యోతి బసు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉమ్మడి జిల్లాలోని గ్రేడ్-1, 2 పంచాయతీ కార్యదర్శుల సర్వీస్ రిజిస్టర్ ఆధారంగా సీనియారిటీ జాబితా రూపొందించారు. ఈ జాబితాను పంచాయతీ రాజ్ కమిషనర్‌కు పంపనున్నట్లు అధికారులు వెల్లడించారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి బీవీ నాగ సాయికుమార్, ఎంపీడీఓలు, డిప్యూటీ ఎంపీడీఓలు పాల్గొన్నారు.

రేపు వీవర్‌శాలలో.. చేనేత దినోత్సవం

● హాజరుకానున్న సీఎం చంద్రబాబునాయుడు
● ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ నాగలక్ష్మి



వీవర్‌శాల వద్ద అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

మంగళగిరి సిటీ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): జాతీయ చేనేత దినోత్సవాలను గురు వారం మంగళగిరి ఆటో నగర్‌లోని వీవర్‌శాలలో జరుగనున్నాయి. ఈ వేడుకలకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హాజరుకానున్నారు. సీఎం పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి మంగళవారం అధికారులతో కలిసి పరిశీలించారు. ముఖ్యమంత్రి ప్రయాణించే మార్గాలు, వీవర్‌శాల వద్ద ఏర్పాట్లు, చేనేత కుటుంబాలతో సమావేశమయ్యే ప్రజావేదిక వద్ద ఏర్పాట్లపై అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి కార్యక్రమాల నిర్వహణ కోఆర్డినేటర్, శాసనమండలి సభ్యులు పెందుర్తి వెంకటేశ్వరరావు, సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవతేజ, తెనాలి సబ్‌కలెక్టర్ సంజనా సింహ, ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ నరసింగరావు, మంగళగిరి తహసీల్దారు దినేష్ రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

టెయిల్‌పాండ్‌లో..

కొనసాగుతున్న విద్యుదుత్పత్తి

● పులిచింతలకు 29,894 క్యూసెక్కులు విడుదల

రెంటచింతల,ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని నాగార్జున సాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో సోమవారం అర్ధరాత్రి 12 గంటల వరకు 1.088 ఎంయూల విద్యుత్‌ను ఉత్పత్తి చేసినట్లు ఎలక్ట్రికల్ ఈఈ సుబ్రహ్మణ్యం, ఏడీఈ గిరిబాబు తెలిపారు. 3 క్రస్ట్ గేట్లను 1.5 మీటర్ల మేర ఎత్తి 21258 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తి అనంతరం టేల్‌రేస్ చానల్ ద్వారా 8,636 మొత్తంగా 29,894 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. సాగర్ నుంచి 28,704 క్యూసెక్కుల నీరొస్తుందన్నారు. రిజర్వాయర్‌లో 75.49 మీటర్ల మేర నీరుండగా ఈ నీరు 7.039 టీఎంసీలకు సమానమన్నారు. వారం నుంచి రెండు యూనిట్ల ద్వారా 13.95 ఎంయూల విదుత్ ఉత్పత్తి అయ్యిందన్నారు.

ఇదెట్టా..!

(5వ పేజీ తరువాయి)

పథకానికి 2019 వెబ్ ల్యాండ్ ప్రకారం లబ్ధిదారులను గుర్తించారని, సుఖీభవ పథకానికి 2005 జూన్ నాటి వెబ్ ల్యాండ్ ప్రకారం లబ్ధిదారుల ఎంపిక జరిగిందని సబంధిత అధికారులు చెబుతున్నారు.

మూడు జిల్లాల్లో బాధితులు ఇలా..

పల్నాడు జిల్లాలో 37,681, బాపట్ల జిల్లాలో 17,241, గుంటూరు జిల్లాలో 13,942 మంది రైతులు పీఎం కిసాన్‌ను కోల్పోయారు. మూడు జిల్లాల్లో 68,864 మంది రైతుల ఖాతాలకు అన్నదాత సుఖీభవ తొలి విడద నగదు రూ.5 వేలు జమ కాలేదు. అలాగే పీఎం కిసాన్ పథకం లబ్ధి పొందిన వారు కూడా.. సుఖీభవకు దూరమయ్యారు. కూటమి ప్రభుత్వం ఏటా రూ20 వేలు పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకాల కింద పెట్టుబడి సాయం అందిస్తానని హామీ ఇచ్చింది. రెండు పథకాల జాబితాలను పరిశీలించి.. అర్హులకు రెండు పథకాల సొమ్ము ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటేనే.. ప్రభుత్వ హామీ నెరవేరుతుంది.

ఈకేవైసీ మతలబు ఏమిటో?

ఈకేవైసీ కాలేదని, ఇంటి మ్యాపింగ్ జరగలేదని, 1బీ నమోదు కాలేదని తదతర అంశాలతో అర్హులైన రైతుల పేర్లను అన్నదాత సుఖీభవ పథకం లబ్ధిదారుల జాబితా నుంచి అధికారులు తొలగించారు. ఇక్కడ తొలగించిన లబ్ధిదారులకు పీఎం కిసాన్ పథకం వర్తించింది. వీరి బ్యాంకు ఖాతాలకు రూ.2 వేలు జమ కావడం గమనార్హం. ఈకేవైసీ పీఎం కిసాన్ పథకానికీ ఉంది. అయితే అక్కడ ఉన్న ఈకేవైసీ.. సుఖీభవకు ఎందు కాలేదు.? రెండు ఈకేవైసీలు ఒకటి కాదా అని లబ్ధిదారుల ప్రశ్నిస్తున్నారు. మ్యాపింగ్ అయిన లబ్ధిదారులకు కూడా సుఖీభవ వర్తించ లేదు. ఇలాంటి వారు కూడా వేలల్లోనే ఉన్నారు.

మృతులకూ.. రేషన్

(5వ పేజీ తరువాయి)

లబ్ధిదారుల సంఖ్యలో పెరుగుదల నమోదు కావడమే తప్ప తొలగించిన వారి సంఖ్య కనిపించదు. అయితే అర్హులు ఎందరో రేషన్ ఫలాలు అందుకోలేక పోతున్నారు. వారిని అధికారులు కార్యాలయాల చుట్టూ తిప్పుకోవడంతో సరిపెడుతున్నారే కానీ కనికరించడంలేదు. బయోమెట్రిక్‌ను దుర్వినియోగిస్తూ కుటుంబంలో చనిపోయిన వారు ఉన్నా వారి సమాచారం ఇవ్వకుండా రేషన్ లబ్ధి పొందుతున్నవారూ ఉన్నారు.

విభాగాల మధ్య లోపం..

అనర్హుల ఏరివేత పక్కాగా జరగాలంటే జిల్లా పౌరసరఫరాల శాఖతో పాటు మండలాల పరిధిలోని రెవెన్యూ విభాగం కూడా సమన్వయంతో అడుగులేయాలి. కానీ క్షేత్రస్థాయిలో అది లోపించింది. మరణ ధ్రువీకరణ పత్రాన్ని వారి కుటుంబ సభ్యులు స్వచ్ఛందంగా అం దిస్తే తప్ప రెవెన్యూ విభాగం మరణాలపై స్పందించడం లేదన్న విమర్శలు న్నాయి. ఈ పత్రాన్ని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయగానే ఆటోమెటిక్‌గా వారి పేరు రేషన్ కార్డు నుంచి తొలగించబడుతుంది. కానీ ఈ పని అందరూ స్వచ్ఛందంగా చేయకుండా ఏళ్ల తరబడి లబ్ధి పొందుతూనే ఉన్నారు. సచివాలయ సిబ్బంది కూడా మరణాలపై దృష్టి పెట్టడం లేదు. పౌర సరఫరాల శాఖ ఈ బాధ్యతల నుంచి తప్పుకోవడంతో అంతిమంగా ప్రభుత్వ ఖజానాపై అదనపు భారం పడుతోంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.75 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	106, 114, 125
చికెన్ విత్ స్కిన్(కిలో)	204.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	214.00

53,097 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 54,912 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 53,097 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 8,514 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9500	13500
నెంబరు. 5	10000	13300
273	---	---
341	10000	14000
4884	----	----
సూపర్ 10	---	----
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	14000
షార్క్-1	-----	----
బ్యాడిగి	10000	12600
దేవనూరు డీలక్స్	10000	12500

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఆర్మూరు	9600	11000
ఏసీ కామన్ వెరైటీ		
334	9500	12800
నెంబరు. 5	10000	13400
273	----	----
341	10000	14800
4884	10000	12500
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	13800
బ్యాడిగి	10000	12200
దేవనూరు డీలక్స్	10200	12400
తాలుకాయలు	5000	7000



బహుమతులు సాధించిన విద్యార్థులతో ముప్పలనేని శ్రీనివాసరావు, బాపట్ల పబ్లిక్ స్కూల్ ఉపాధ్యాయులు

వాలీబాల్ పోటీలలో బాపట్ల పబ్లిక్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

బాపట్ల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : వాలీబాల్ పోటీలలో బాపట్ల పబ్లిక్‌స్కూల్ విద్యార్థులు అత్యంత ప్రతిభను కనబరిచారు. జూలై 6వ తేదీన తెలంగాణ రాష్ట్రం హనుమకొండలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో ప్రథమస్థానం పొందిన బాపట్ల పబ్లిక్ స్కూల్ విద్యార్థులు జూలై నెల 26, 27 తేదీలలో గోవాలో జరిగిన 15వ జాతీయ యువజన వాలీబాల్ క్రీడా పోటీలలో కూడా జాతీయ స్థాయిలో ప్రథమస్థానం పొందటం ఎంతో గర్వకారణమని, ఇది పాఠశాలకు కూడా గొప్పకీర్తిని కలిగించే విషయమని బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పబ్లిక్ స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న దిలీప్, కె.మోహన్, ఎ.వైభవ్, కె.కార్తీక్, షేక్ రెహన్, హెచ్.సంతోష్, ఎం.సాత్విక్ అనే విద్యార్థులు ఈఘనత సాధించటం జరిగిందని తెలిపారు. ఈవిద్యార్థులు ఆగస్టునెలలో జరగబోవు వాలీబాల్ అంతర్జాతీయ పోటీలకు శ్రీలంక వెళుతున్నారని తెలిపారు.బాపట్ల ఆర్ట్స్ కళాశాలకు చెందిన పీడీఎం రామారావు నేతృత్వంలో విద్యార్థులు విజయం సాధించటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సెక్రటరి మానం నాగేశ్వరరావు, సొసైటీ కార్యవర్గ సభ్యులు విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందించారు.

బయో మైనింగ్‌ను పరిశీలించిన కమిషనర్

బాపట్ల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల పట్టణం జమ్ములపాలెం రోడ్డులోని మున్సిపల్ డంపింగ్ యార్డును మంగళవారం మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి పరిశీలించారు. బయోమైనింగ్ జరుగుతున్న తీరును పరిశీలించారు. అనంతరం బాపట్లలోని పలు వార్డులో ఆయన పర్యటించారు. ఎస్ఎన్‌పీ అగ్రహారం జీబీసీ రోడ్డులో రోడ్ల మార్జిన్‌లలో అధికంగా మట్టి నిల్వలు ఉండటం వలన రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్న మీదట ట్రాక్టర్ దోజర్ ద్వారా మట్టి తొలిగింపును దగ్గర ఉండి ఆయన పర్యవేక్షించారు. ప్రధాన కూడళ్లలో, రోడ్లపైన ఎక్కడ కూడా చెత్త నిల్వలు లేకుండా ఎప్పటికప్పుడు తరలించాలని శానిటరి సిబ్బందికి సూచనలు చేశారు. ప్రధాన డ్రైనేజిలు, వార్డులలో గల అంతర్గత డ్రైనేజీలలో పూడిక పనులు ఎప్పటికప్పుడు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. పట్టణ పారిశుధ్యం విషయంలో పారిశుధ్య విభాగ సిబ్బంది పనితీరును ఎప్పటిప్పుడు క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని సూచించారు. విధులలో అలసత్వం వహిస్తే చర్యలకు వెనుకాడేదిలేదని హెచ్చరించారు.



డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి

బదిలీపై వెళుతున్న ఉద్యోగులకు ఘన సత్కారం

పిట్టలవానిపాలెం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : అంకితభావంతో పని చేసే ఎంతటి స్థాయి అధికారులకైనా సమాజంలో ఎనలేని గుర్తింపు లభిస్తుందని పిట్టలవానిపాలెం గ్రామసర్పంచ్ బొలగాని అరుణకుమారి సుబ్బారావు అన్నారు. మండల కేంద్రమైన గ్రామ సచివాలయంలో పిట్టలవానిపాలెం గ్రామసర్పంచ్ ఆధ్వర్యంలో మంగళవారం నూతనంగా సచివాలయ ఉద్యోగులుగా బాధ్యతలు చేపట్టిన వారితో కలిసి బదిలీపై వెళుతున్న సచివాలయ ఉద్యోగులను పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సన్మాన కార్యక్రమాన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శి డి.ప్రసాదరావు పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామసర్పంచ్ బొలగాని అరుణకుమారి సుబ్బారావు దంపతులను సచివాలయ ఉద్యోగులు పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు.



గ్రామసర్పంచ్ బొలగాని అరుణకుమారి సుబ్బారావు దంపతులను సన్మానిస్తున్న సచివాలయ ఉద్యోగులు

నేడు బాపట్లలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పర్యటన

బాపట్ల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ బుధవారం బాపట్లలో పర్యటించనున్నట్లు భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు కొండమూది బంగారుబాబు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పర్యటనలో బీజేపీ కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

7న కొబ్బరి చిప్పల సేకరణకు వేలం పాట

పిట్టలవానిపాలెం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందోలు గ్రామంలో ఉన్న శ్రీబగళాముఖి అమ్మవారి దేవస్థానంలో భక్తులు సమర్పించిన కొబ్బరి చిప్పలు సేకరణకు లీజు లైసెన్స్ హక్కు కొరకు ఈనెల 7వ తేదీ ఉదయం 11 గంటలకు అమ్మవారి ఆలయంలో బహిరంగ వేలం పాట జరుగుతుందని ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి తెలిపారు. ఈవేలం పాట దేవదాయశాఖాధికారుల సమక్షంలో జరుగుతుందని చెప్పారు. ఆసక్తి కలిగిన వారు ముందుగా రూ.5వేలు డిపాజిట్ చెల్లించి ఈ వేలం పాటలో పాల్గొనవచ్చునని తెలిపారు. వివరాలకు దేవాలయంలో సంప్రదించాలని కోరారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే వేగేశన

బాపట్ల రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పిట్టలవానిపాలెం మండలంలోని అర్హులైన 22 మంది లబ్ధిదారులకు వైద్యఖర్చులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్రవర్మ మాట్లాడుతూ వైద్యఖర్చులు భరించలేని కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మద్దతునివ్వటం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తామని, అర్హులైన మధ్యతరగతి పేద కుటుంబాలు సీఎం సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మొత్తం రూ.13,52,443 విలువ గల సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను బాధితులకు ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పంపిణీ చేశారు.



బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

ట్రాక్టర్ ఢీకొని ఇద్దరికి గాయాలు

నగరం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : నగరం సెంటర్ సమీపంలో ట్రాక్టర్ అతి వేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ ఇద్దరిని ఢీకొన్నట్టు నగరం ఎస్ఐ బండ్ల భార్గవ్ తెలిపారు. సెంటర్‌లో నడుచుకుంటూ వెళుతున్న తాటిపాక జయప్రద(42)ను ట్రాక్టర్ ఢీకొని ఈడ్చుకుంటూ వెళ్ళి పక్కన ఉన్న బజ్జీల బండిని ఢీకొని ఎదురుగా ఉన్న గోడకు తగిలి ఆగింది. టిఫిన్ సెంటర్ యజమాని గాయపడినట్లు తెలిపారు. జయప్రదకు తీవ్ర గాయాలు కాగా నగరం నుంచి మణిపాల్ హాస్పటల్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.



ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్

అవినీతి, అక్రమాల చరిత్ర గల పార్టీ వైసీపీ

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : అవినీతి, అక్రమాల చరిత్ర గల పార్టీ ఏదైనా ఉందంటే అది కేవలం వైసీపీయేనని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. బాపట్ల తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్ల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని కర్లపాలెం నుంచి పెదపులుగువారిపాలెం వరకు ఉన్న రోడ్డు అధ్వానంగా ఉందని ఇటీవల ఆర్ అండ్ బి మంత్రిని కలవటం జరిగిందన్నారు. ఆ రోడ్డు నిర్మాణం కోసం గతంలో 3 కోట్లు మంజూరు చేయగా వాటిని ఆపివేసి సుమారు 5 కోట్ల 10 లక్షలకు పెంచి శాంక్షన్ చేయటం జరిగిందన్నారు. త్వరలోనే టెండర్లు పూర్తి చేసి నిర్మాణం పూర్తి చేయటం జరుగుతుందన్నారు. అదేవిధంగా టూరిజం అభివృద్ధిలో భాగంగా డిప్యూటీ సీఎం అందుబాటులో లేనందున డిప్యూటీ సీఎం ఓఎస్డీని కలిసి సుమారు 10 వినతిపత్రాలను అందించటం జరిగిందని చెప్పారు. అందులో ముఖ్యంగా పాండురంగాపురం నుంచి సూర్యలంక, ఎయిర్‌ఫోర్స్ పక్క నుంచి కలిపే డిఫారెస్ట్‌రోడ్డు గురించి, పేరలి డ్రైన్‌లో జెట్టి కట్టటం కోసం లాంటి ప్రతిపాదనలు ఇవ్వటం జరిగిందన్నారు. అదేవిధంగా బాపట్ల ఏరియా వైద్యశాలలో 100 నుంచి 300 పడకలు ఏర్పాటు చేసే విధంగా వినతిపత్రాలను ఆరోగ్య శాఖ మంత్రిని కలిసి ఇవ్వటం జరిగిందన్నారు. సుమారుగా రూ.480 కోట్లు బాపట్ల నియోజకవర్గం నుంచి అన్ని శాఖలు నుంచి ప్రభుత్వానికి ప్రొపోజల్స్‌ను పంపించటం జరిగిందన్నారు. గత ప్రభుత్వంలో బాపట్లలో మెడికల్ కళాశాల ఎటువంటి పర్మిషన్ లేకుండా మొదలు పెట్టారని, మూడుదశలలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో బాపట్ల మెడికల్ కళాశాల పూర్తి చేస్తామన్నారు. దీనికి సంబంధించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వినతిపత్రం ఇవ్వటం జరిగిందన్నారు. సూర్యలంకటూరిజం అభివృద్ధిలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఎంపీలు పెమ్మసాని చంద్రశేఖర్ (గుంటూరు), తెన్నేటి కృష్ణప్రసాద్ (బాపట్ల) కలిసికట్టుగా రూ.97 కోట్లు మంజూరు చేయటం జరిగిందన్నారు. అందులో రూ.50 కోట్లకు టెండర్లు వేయటం జరుగుతుందన్నారు. 2029లో బాపట్లలో మరలా టీడీపీని గెలిపించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయటం జరుగుతుందన్నారు.

తమ కుటుంబం మాత్రమే బాపట్ల ఎమ్మెల్యే అభ్యర్థిగా ఉండాలని అనుకునే వ్యక్తి కోన రఘుపతి అన్నారు. గత ప్రభుత్వంలో మున్సిపాలిటిలో 12కోట్ల రూపాయలు బకాయిలు పెట్టిన వ్యక్తి కోన రఘుపతి అన్నారు. రంగులపైత్యం వైసీపీకి ఉంది కనుకనే గత ప్రభుత్వంలో బాపట్ల ఏరియా వైద్యశాలకు వైసీపీ రంగులు వేశారన్నారు. గత ప్రభుత్వంలో వివిధ సబ్ ప్లాన్‌లకు వచ్చిన నిధులను సంక్షేమ పథకాలకు వాడారని తెలిపారు.

ట్రూఅప్ పేరుతో విద్యుత్ చార్జీలు పెంచవద్దు : సీపీఎం

బాపట్ల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ స్మార్ట్‌మీటర్లు బిగించవద్దని, ట్రూఅప్, సర్దుబాటు చార్జీల పేరుతో విద్యుత్ చార్జీలు పెంచవద్దని బాపట్ల తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం కార్యదర్శి సీహెచ్ గంగయ్య మాట్లాడుతూ విద్యుత్ స్మార్ట్‌మీటర్లు బిగించటానికి వస్తే ప్రజలు తిరగబడాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ ఛార్జీలు పెరిగి ప్రజలు గగ్గోలు పెడుతుంటే కేంద్రంలో అదానీకి మోకరిల్లి గత వైసీపీ చేస్తున్న ఒప్పందంలో భాగంగా కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు పెట్టి ప్రజల దగ్గర కొన్నివేల కోట్ల రూపాయలు విద్యుత్ బిల్లులు వసూళ్ళు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి సీహెచ్ మజుందార్, జనవిజ్ఞానవేదిక జిల్లా అధ్యక్షుడు వై.భాస్కరరావు, సీపీఎం సీనియర్ నాయకుడు కె.నాగేశ్వరరావు, టి.సుభాషిణి పాల్గొన్నారు.



బాపట్ల తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం కార్యదర్శి గంగయ్య, సీపీఎం నాయకులు

ఇసుకపల్లిలో...

రేపల్లె, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వినియోగదారులపై ట్రూఅప్ పేరుతో విద్యుత్ చార్జీలు పెంచవద్దని సీపీఎం పట్టణ కార్యదర్శి సీహెచ్ మణిలాల్ అన్నారు. ఇసుకపల్లిలోని విద్యుత్ కార్యాలయం వద్ద ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పులు ఇప్పుడు కూటమి ప్రభుత్వం స్మార్ట్‌మీటర్ల పేరుతో దోపిడీ చేస్తుందని అన్నారు. సీపీఐ ఎంఎల్ నాయకులు ఎం.శోభారాణి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ భారం పెంచి ప్రజల నడ్డివిరుస్తున్నారన్నారు. పట్టణంలో వ్యాపారస్తులను బెదిరించి స్మార్ట్‌మీటర్లు పెట్టటం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో వామపక్షాల నాయకులు వై.కిషోర్, సుబ్బారావు, సాయిప్రసాద్, వీ.ధనమ్మ, కె.నాంచారమ్మ, సీహెచ్ ప్రకాష్, కె.రమేష్, వి.ఆగస్టిన్, ఈశ్వరరావు, సీతారామయ్య, వెంకట్రావు పాల్గొన్నారు.

విద్యుత్ కోతతో అల్లాడిన ప్రజలు

కర్లపాలెం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కర్లపాలెంలో మంగళవారం ఉదయం 9 గంటలు నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయటంతో విద్యుత్ వినియోగదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. విద్యుత్ శాఖ సిబ్బంది తీగలకు అడ్డం వచ్చే చెట్లను నరికే ప్రక్రియను మంగళవారం కేటాయించుకోగా ఎండతాపంకు తట్టుకోలేక వృద్దులు, చిన్నారులు ఉక్కపోతతో విలవిలలాడిపోయారు. రెండో శనివారం, ఆదివారం చేసుకోవాల్సిన పనులను మంగళవారం నిర్వహించటంతో ప్రజలు విద్యుత్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఏఈ బాషాను వివరణ కోరగా అధికారుల ఆదేశాల మేరకు తీగలకు అడ్డం వచ్చే చెట్లను నరికే ప్రక్రియను పెట్టుకున్నామని, అందువలనే విద్యుత్ సరఫరా నిలుపుదల చేశామని తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

కర్లపాలెం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని బుద్దాం గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. కర్లపాలెం ఎస్ఐ ఎస్.రవీంద్ర తెలిపిన వివరాల ప్రకారం బుద్దాం గ్రామానికి చెందిన మిద్దిబోయిన శ్రీనివాసరావు ఉదయాన్నే తన పొలానికి వెళుతుండగా తుంగభద్రకు వెళ్ళే మార్గంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనటంతో శ్రీనివాసరావు మృతి చెందాడు. అతనికి భార్య తిరుపతమ్మ, కుమార్తెలు ఇరువురు ఉన్నారు. భార్య తిరుపతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ రవీంద్ర కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు..

వాహనచోదకులకు ధ్రువీకరణ పత్రాలు వెంట ఉండాలి : ఎస్ఐ

పిట్టలవానిపాలెం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : వాహనచోదకులకు తప్పనిసరిగా ధ్రువీకరణపత్రాలు వెంట ఉండాలని చందోలు ఎస్ఐ ఎం.వెంకటశివకుమార్ అన్నారు. మండలంలోని చందోలు పోలీసు స్టేషన్ పరిధిలోని రెడ్డిపాలెం టోల్‌ప్లాజాలో ఆయన మంగళవారం వాహనాల తనిఖీలు నిర్వహించారు. వాహనపత్రాలు సరిగ్గా లేని వాహనాలకు అపరాధ రుసుం విధించారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్ఐ కోరారు.

హిందువులకు శ్రావణ మాసం శుభప్రదం

భట్టిప్రోలు (కొల్లూరు), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : హిందువులకు శ్రావణ మాసం శుభప్రదమని సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా మహిళ కన్వీనర్ బి.విజయలక్ష్మి అన్నారు. భట్టిప్రోలులో మంగళవారం నిర్వహించిన సంస్థ సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ, శ్రీకృష్ణుని జననం అద్భుతమన్నారు. జిల్లా దేవాలయ ప్రముఖ్ పొన్నపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ, ఆగస్టు నెలలో 5, 19 తేదీల్లో ఏకాదశి నగర సంకీర్తన కార్యక్రమాలు, 9న సత్సంగం, పౌర్ణమి సామూహిక హారతులు నిర్వహించాలని సభ్యులకు సూచించారు. ప్రతి గ్రామంలో ధర్మరక్ష బంధన్ కార్యక్రమాలు ధార్మిక సమితి ఆధారంగా నిర్వహించుకోవాలని సూచించారు. శ్రావణ మంగళవారాన్ని పురస్కరించుకుని పరంజ్యోతి అమ్మ భగవాన్ మందిరంలో అమ్మవారికి కుంకుమ పూజ నిర్వహించారు. వెల్లటూరు గీతా మందిరంలో హరేకృష్ణ హరేరామ నామ సంకీర్తన నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు, సభ్యులు పడమట వెంకటేశ్వరావు, బొలగాని వెంకటేశ్వర్లు, చింతల మురళీకృష్ణ, ఏల్చూరి శ్రీనివాసరావు, బి.శ్రీనివాసరావు, బూర్లె అరుణకుమారి, శ్రీలక్ష్మీ, అనసూయ తదితరులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీవో రామలక్ష్మి

ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులపై సమీక్ష

నగరం,ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి) : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డీపీవో నాగిరెడ్డి, ఆర్డీవో రామలక్ష్మితో కూడిన కమిటీ మండలంలోని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, సర్వశిక్షాభియాన్ పథకం నిర్వహించటం జరిగింది. ఈ సమావేశంలో మండల తహసీల్దార్ నాంచారయ్య పాల్గొన్నారు. మండలంలోని 25 మంది ఫీల్డు అసిస్టెంట్‌లు సరైన రికార్డులు నమోదు చేయకపోవటంపై కమిటీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. మినీగోకులం షెడ్ల నిర్మాణం, ఉపాధి హామీపథకం పనులు, సర్వశిక్షాభియాన్ కార్యక్రమాలు సక్రమంగా అమలు కావటానికి అధికారులు దృష్టిసారించాలని ఆదేశించారు.

శాస్త్ర పరిజ్ఞానంతో పాటు రైతు అనుభవాన్ని జోడించాలి

వేమూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయానికి శాస్త్ర పరిజ్ఞాన అంశాలను దృష్టిలో పెట్టుకోవడంతో పాటు రైతు అనుభవాన్ని కూడా జోడించి పంటలు సాగు చేయాలని మండల వ్యవసాయ శాఖ అధికారి ప్రేమ్‌సాగర్ సూచించారు. మండలంలోని చావలి గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులతో కలిసి సాధారణ నాట్లు, వెదనాట్లను పరిశీలించారు. ప్రతి రైతు ఎకరాకు రూ.800 చొప్పున బీమా చేసుకోవాలని తెలిపారు. బీమా చేసుకుంటే ప్రకృతి వైపరీత్యాల వల్ల కలిగే నష్టాలకు ప్రభుత్వం నుంచి ప్రతిఫలాన్ని పొందవచ్చన్నారు. అన్నదాత సుఖీభవ ద్వారా ఖాతాలకు డబ్బు జమ పడని రైతులు రైతు సేవా కేంద్రాల దగ్గర ఆధార్ సరిచూసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

ఆళ్ళవారిపాలెం, రాజవోలులో...

చెరుకుపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : ఆళ్ళవారిపాలెం, రాజవోలులో మంగళవారం జరిగిన పొలంబడి కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎండీ ఫారూఖ్ పాల్గొని మాట్లాడారు. ఎరువులు రిటైల్ డీలర్లు, సొసైటీ వారి దగ్గర తగినన్ని ఉన్నాయని, రిటైల్ వ్యాపారులు, ఎరువులు అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సంప్రదాయ ఎరువులతోపాటు నానో ఎరువులు పంటలపై పిచికారి చేయడం వలన భూమి కాలుష్యం తగ్గడంతో పాటు పోషకాల లభ్యత మొక్కలకు త్వరగా చేరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆళ్ళవారిపాలెం గ్రామసర్పంచ్ కె.శ్రీనివాసరావు, ఏఈవో ప్రేమ్‌చంద్, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

పల్లెకోన, కోనేటిపురం గ్రామాల్లో...

భట్టిప్రోలు (కొల్లూరు), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : రెండు గ్రామాల్లో వ్యవసాయాధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల పరిధిలోని పల్లెకోన, కోనేటిపురం గ్రామాల్లో మంగళవారం వ్యవసాయాధికారి బ్రహ్మారెడ్డి పాల్గొని వెద పద్ధతిలో సాగు చేసిన రైతులకు సలహాలు, సూచనలు అందజేశారు. కార్యక్రమంలో ఏఈవోలు, లక్ష్మీప్రసన్న, బుష్, అఖిల, విఏఎలు రత్నరాజు, యుగంధర్, రైతులు పాల్గొన్నారు.

వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన ర్యాలీ

చెరుకుపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ సూచనల మేరకు వాట్సాప్ గవర్నెన్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు చెరుకుపల్లిలో స్థానిక టీడీపీ నాయకులు, పంచాయతీ సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఖాదర్‌ఖాన్ సెంటర్ నుంచి ఐలాండ్‌సెంటర్ వరకు ఈ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా డిప్యూటీ ఎంపీడీవో కేజీ శ్రీనివాసన్ మాట్లాడుతూ వాట్సాప్ గవర్నెన్స్ వల్ల గవర్నమెంట్ సర్వీసులు అన్నీ ప్రజల చేతుల్లోనే ఉంటాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎం.రాధాకృష్ణమూర్తి, దివి రాంబాబు, ఎస్. సుబ్బారావు, కె.వెంకటేశ్వరరావు, వి.శ్రీనివాసరావు, సంపత్‌బాబు, జూనియర్ అసిస్టెంట్, సచివాలయ సిబ్బంది, నరేష్, సురేష్ పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న టీడీపీ నాయకులు, చెరుకుపల్లి సచివాలయ సిబ్బంది

కర్లపాలెంలో...

కర్లపాలెం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన వాట్సప్ గవర్నెన్స్‌పై కర్లపాలెంలోని పంచాయతీ, విద్యుత్ సిబ్బంది మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. 9552300009 నెంబర్‌కు వాట్సప్ చేసి 200కు పైగా సేవలు పొందవచ్చునని నినాదాలు చేశారు.

జూదరుల అరెస్టు

నిజాంపట్నం (రేపల్లె), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : తీరప్రాంతంలో పేకాట నిర్వహిస్తే ఉపేక్షించేది లేదని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అడవులదీవి ఎస్ఐ బాబూరావు తెలిపారు. నిజాంపట్నం మండలం ప్రజ్ఞం గ్రామ పొలాల వద్ద పేకాట ఆడుతున్న 9 మంది పేకాటరాయుళ్ళను అరెస్టు చేశామని తెలిపారు. వారి వద్ద నుంచి కొంత నగదును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.



అనారోగ్యంతో బాధపడుతున్న సీనియర్ నాయకుడు బసవయ్యను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే

కొల్లూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాధపడుతున్న సీనియర్ నాయకునితో పాటు ఇటీవల మృతి చెందిన వ్యక్తుల కుటుంబాలను ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మంగళవారం పరామర్శించారు. కొల్లూరులో టీడీపీ సీనియర్ నాయకులు వెనిగళ్ల బసవయ్య కొన్నాళ్లుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడని తెలుసుకున్న ఎమ్మెల్యే, మండల పార్టీ అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు కోగంటి హరిప్రసాద్, పార్టీ నాయకులతో కలిసి ఆయన స్వగృహానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని పరామర్శించారు. కొల్లూరుకు చెందిన యలవర్తి భానుప్రకాష్ కుమారుడు ఆదిత్యసాయి రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. యువకుడి అవయవాలు అవసరమైన రోగులకు దానం చేసిన విషయం తెలుసుకుని ఎమ్మెల్యే ఆనందబాబు తల్లిదండ్రులతో పాటు తాత జగన్‌మోహన్‌రావును పరామర్శించారు. పుత్రుడిని కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్నప్పటికీ వైద్యులు సూచనలతో అవయవ దానం చేసిన తల్లిదండ్రులకు ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. గుండెపోటుతో మృతి చెందిన సీనియర్ కార్యకర్త కొల్లి నాగేశ్వరరావు చిత్రపటం, ఎన్నారై మాకినేని బసవశంకర్ మాతృమూర్తి లక్ష్మీకాంతమ్మ చిత్రపటాలకు ఆయా గృహాలకు వెళ్లి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల పరిధిలోని తడికలపూడి గ్రామానికి చెందిన ముమ్మనేని మురళీకృష్ణ మాతృమూర్తి చిట్టెమ్మ కన్నుమూసిన సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే గ్రామానికి వెళ్లి ఆ కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యార్లగడ్డ శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు సుంకర శ్రీను, బోయపాటి తేజ, గొరికపూడి ప్రసాద్‌పాల్గొన్నారు.

విద్యార్థులు మత్తుకు బానిసకాకూడదు

● అడవులదీవి ఎస్ఐ బాబూరావు

నిజాంపట్నం(రేపల్లె), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : దేశం అభివృద్ధిచెందాలంటే విద్యార్థుల పాత్ర ఎంతో ఘనసీయమైనదని డ్రగ్స్ అనే విషపు ఊపిరిని తీసుకుంటూ తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని అడవులదీవి ఎస్ఐ బాబూరావు అన్నారు. అడవులదీవి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈగల్‌సెల్ బాపట్ల ఆధ్వర్యంలో విద్యార్థులకు మంగళవారం డ్రగ్స్‌పై అవ గాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు ఉన్నత స్థితికి ఎదిగే విధంగా విద్యను అభ్యసించాలని సూచించారు. మత్తుకు బానిసకాకుండా సెల్ ఫోన్‌ల బారినపడకుండా ఉండాలన్నారు. ఈకార్యక్రమంలో ఈగల్ ఐజీపీ ఆర్కే రవికృష్ణ, ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తున్న అడవులదీవి ఎస్ఐ బాబూరావు

తల్లిపాలు అమృతంతో సమానం

వేమూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : తల్లిపాలు అమృతంలో సమానమని తద్వారా బిడ్డలు ఆరోగ్యవంతులుగా పెరుగుతారని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అమృతవాణి అన్నారు. మంగళవారం మండలంలోని పెరవలి గ్రామంలో తల్లి పాల వారోత్సవాలలో భాగంగా గర్భిణీలు, బాలింతలకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అమృతవాణి మాట్లాడుతూ, ఆరోగ్యపరమైన విషయాలపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తల్లిపాల పెరుగుదలకు తీసుకోవాల్సిన ఆహార పదార్థాలను తెలియజేశారు. బిడ్డలకు పాలు పట్టే విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు మరియమ్మ, మాణిక్యమ్మ, లక్ష్మి, పద్మ తదితరులు పాల్గొన్నారు.



పెరవలి సమావేశంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ అమృతవాణి

నూతన అక్రిడిటేషన్ అందించాలని వినతి

కొల్లూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : పాత్రికేయుల అక్రిడేషన్ గడువు పొడిగించకుండా నూతన అక్రిడేషన్ మంజూరు చేయాలని కోరుతూ తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లుకు ఏపీయూడబ్ల్యూజే అసోసియేషన్ ఆధ్వర్యంలో సంఘ కార్యదర్శి సుబ్బారావు, కొల్లూరు పాత్రికేయులు మంగళవారం వినతి పత్రం అందజేశారు. సుబ్బారావు మాట్లాడుతూ నూతన అక్రిడిటేషన్ మంజూరు చేయడంతో పాటు అన్ని మండలాలలో పని చేస్తున్న ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులందరికి అక్రిడిటేషన్ అందించాలని కోరారు. కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

రక్షిత మంచినీటి పైపులైన్‌లకు మరమ్మతులు

అమృతలూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : అమృతలూరులో రక్షిత మంచినీటి పైపులైన్‌ల మరమ్మతులను మంగళవారం పూర్తి చేశారు. 'అంతర్గత కలహాలతో అభి వృద్ధి శూన్యం.. సమస్యలపై దృష్టి సారించని పాలకవర్గం' అని సోమవారం ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. ఈవోపీఆర్డీ, ఇన్‌చార్జి ఎంపీడీవో జొన్నలగడ్డ వినయ్‌బాబు తక్షణమే రక్షిత మంచినీటి పైపులైన్ మర మ్మతు పనులు చేయాలని ఆదేశించారు. దీంతో పంచాయతీ సిబ్బంది, గ్రామంలో పలు చోట్ల ఉన్న పైపు లైన్‌ల మరమ్మతు పనులను మంగళవారం చేపట్టారు. పనులను క్షేత్ర స్థాయిలో ఈవోపీఆర్డీ పరిశీలించారు. పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట సర్పంచ్ దేవరకొండ రాము, సచివాలయ సిబ్బంది, తదితరులు ఉన్నారు.



రక్షిత మంచినీటి పైపు లైన్ లీక్‌ల మరమ్మతు పనులను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీవో వినయ్‌బాబు

రీ సర్వేపై రైతులకు అవగాహన

చుండూరు (అమృతలూరు), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : చుండూరు మండల పరిధిలోని చినపరిమి గ్రామంలో రీ సర్వేపై రైతులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గ్రామ సభలో తహసీల్దార్ నాగరాజు డీఎల్ఆర్ కాపీ రైతులకు వివరించారు. రైతులకు పలు సందేహాలను నివృత్తి చేశారు. గ్రామంలోని వ్యవసాయ భూములను రీసర్వే చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



ఓ ఉపాధ్యాయుడి.. ఏఐ ఊహ

ఒకవైపు ఎత్తైన గేట్లు.. వాటి నుంచి జాలు వారుతూ కృష్ణమ్మ శోయగాలు.. నదిలో నీటి పరవళ్లు.. ఆ పక్కనే పచ్చని చెట్లు.. ఎమ్యూజిమెంట్ పార్కు.. చిన్నా పెద్ద మైమరిచేలా ఉన్న ఈ అందాల ఊహ మాచర్లకు చెందిన జకీర్ హుస్సేన్ అనే ఉపాధ్యాయుడి ఆలోచన. ఏఐ సహకారంతో రూపొందించిన ఈ అత్యద్భుత ఊహాచిత్రాలను సోషల్ మీడియాలో పోస్టు చేసి పర్యాటకుల అభిప్రాయాన్ని ఆ ఉపాధ్యాయుడు కోరారు. ఆ ఉపాధ్యాయుడి ఆలోచన కార్యరూపం దాల్చాలని పలువురు కోరుతున్నారు. సాగర్ వద్ద విమానాశ్రయం మంజూరు కాగా.. ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తే పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వానికి పెద్దఎత్తున ఆదాయం లభిస్తుంది. పర్యాటక కేంద్రంగా సాగర్ అభివృద్ధిపై మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

-(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

అమృత్ స్టేషన్లలో పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

- నాణ్యత, భద్రతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలి
- దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ

గుంటూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): అమృత్ స్టేషన్ స్కీమ్ కింద గుంటూరు రైల్వే డివిజన్‌లో ఎంపిక చేసిన రైల్వే స్టేషన్ల అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ ఆదేశించారు. పనులు నాణ్యతగా జరిగేలా నిరంతరం ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షించాలన్నారు. భద్రతా ప్రమాణాలు కూడా పాటించేలా చూడాలన్నారు. మంగళవారం రియర్ గ్లాస్ విండో వాహనం(రైలు) ద్వారా పగిడిపల్లి నుంచి గుంటూరు రైల్వే డివిజన్ అధికారులతో కలిసి ఇన్‌స్పెక్షన్ ప్రారంభించారు. ఆయనతో పాటు గుంటూరు, విజయవాడ డివిజన్ల రైల్వే మేనేజర్లు సుదేష్ణ సేన్, మోహిత్ సోనాకియా ఆయన వెంట ఉన్నారు. పగిడిపల్లి - గుంటూరు సెక్షన్‌లో అనుమతించిన వేగంతో రైలు ప్రయాణించినప్పుడు కుదుపులు వస్తున్నాయా, లేదా అని పరిశీలించారు. ఈ సందర్భంగా జీఎం సిగ్నలింగ్ వ్యవస్థ, భద్రతా అంశాలను, రైల్వే ట్రాక్‌ల నిర్వహణను తనిఖీ చేశారు. నల్గొండ రైల్వే స్టేషన్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేసి వెయిటింగ్ హాల్, దివ్యాంగుల టాయిలెట్లు, లిఫ్ట్, తాగునీటి సౌకర్యాలను పరిశీలించారు. ప్లాట్ ఫాం, సర్క్యులేటింగ్ ప్రాంతాన్ని కూడా సందర్శించారు. తర్వాత గుంటూరు డివిజన్ ప్రధాన కార్యాలయంలో డివిజనల్ రైల్వే మేనేజర్, ఇతర డివిజనల్ అధికారులతో డివిజన్ పనితీరుపై వివరణాత్మక సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. డివిజన్‌లో చేపట్టిన వివిధ అభివృద్ధి ప్రాజెక్టుల స్థితి, పురోగతిపై అధికారులు క్లుప్తంగా ఆయనకు వివరించారు. అమరావతి రాజధానికి నూతన రైలు మార్గం, నడికుడి - శ్రీకాళహస్తి రైలు మార్గాల ప్రస్తుత స్థితి గురించి తెలుసుకొన్నారు. గుంటూరులో మొక్కలు నాటే కార్యక్రమంలో జీఎం పాల్గొన్నారు.

అనంతరం జనరల్ మేనేజర్ మంగళగిరి రైల్వే స్టేషన్‌ను పరిశీలించి ప్రయాణికుల సౌకర్యా లు, స్టేషన్‌లోని ఇతర వసతులను తనిఖీ చేశా రు. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా జరుగుతున్న పునరాభివృద్ధి పనులను కూడా ఆయన పరిశీలించారు. పని ప్రదేశంలో అన్ని భద్రతా మార్గదర్శకాలను పాటించాలని, నిర్మాణ పనులను నిర్ధారించిన గడువు నాటికి పూర్తి చేయడానికి పనుల వేగాన్ని పెంచాలని ఆయన అధికారులను ఆదేశించారు. అనంతరం విజయవాడ డివిజన్ పర్యటనకు జీఎం వెళ్లారు. జనరల్ మేనేజర్ గుంటూరు డివిజన్ తనిఖీ సందర్భంగా వివిధ కార్మిక సంఘాల సభ్యుల నుంచి విజ్ఞాపనలను స్వీకరించారు.



రైల్వే ట్రాక్ తనిఖీ చేస్తున్న రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ



గుంటూరు రైల్వే డివిజన్ ఇన్‌స్పెక్షన్‌లో పాల్గొన్న రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ

పెరోటిడ్ కార్సినోమా రోగికి అరుదైన శస్త్రచికిత్స



మాట్లాడుతున్న రమణ యశస్వి, పక్కన కోలుకున్న అశోక్

గుంటూరు మెడికల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): లాలాజల గ్రంధికి సోకిన కేన్సర్ ట్యూమర్‌తో రెండేళ్లుగా బాధపడుతున్న యువకుడికి గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స నిర్వహించి, ప్రాణాలు సంరక్షించారు. మంగళవారం ఆసుపత్రి సర్జరీ విభాగంలోని జెయిలీ హాల్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో కేసు వివరాలను సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి తెలిపారు. ప్రత్తిపాడు మండలం గొట్టిపాడుకు చెందిన అశోక్‌కు (32) రెండేళ్లుగా ముఖంపై గడ్డ ఏర్పడింది. చికిత్స కోసం పలు ఆసుపత్రులను ఆశ్రయించినా ఆపరేషన్ చేసేందుకు ప్రైవేటు వైద్యులు ముందుకు రాలేదు. చివరి ప్రయత్నంగా అశోక్ ఇటీవల గుంటూరు జీజీహెచ్‌కు వచ్చారు. జనరల్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ యేకుల కిరణ్‌కుమార్, బాధితుడికి సీటీ స్కాన్, బయాప్సీ తదితర పరీక్షలు చేయించారు. ఇది లాలాజల గ్రంధి కణితిగా (మిక్స్‌డ్ పెరోటిడ్ ట్యూమర్) తేలింది. గడ్డను తొలగించడం ఆలస్యమైతే కేన్సర్ కణితిగా మారే ప్రమాదం ఉంటుంది.

వైద్యులకు సవాల్‌గా మారిన వైనం...

ముఖంలో 24 కండరాలతో పాటు ఐదు కపాల నరాలు ఉంటాయి. ముఖంపై కణితిని తొలగించే క్రమంలో ముఖ కండరాలు, నరాలు దెబ్బతింటే ఆహారం తీసుకోవడంలో ఇబ్బందితో పాటు ముఖ కవళికల్లో మార్పులు వస్తాయి. దీంతో వైద్య నిపుణులు సవాల్‌గా ఈ కేసును స్వీకరించారు. డాక్టర్ కిరణ్ కుమార్ నేతృత్వంలో జనరల్ సర్జరీ వైద్య బృందం నాలుగు గంటల పాటు శ్రమించి అశోక్‌కు క్లిష్టమైన శస్త్రచికిత్స నిర్వహించారు. ముఖంలో కండరాలు, నరాలు ఏమాత్రం దెబ్బతినకుండా పెరోటిడ్ ట్యూమర్‌ను విజయవంతంగా తొలగించారు. ఆపరేషన్ అనంతరం కణితిని పెథాలజీ పరీక్షలకు పంపగా, పెరోటిడ్ కార్సినోమా (లాలాజల గ్రంధి కేన్సర్‌గా) నిర్ధారణ అయ్యింది. సకాలంలో కేన్సర్ గడ్డను తొలగించడంతో అశోక్‌కు ప్రాణగండం తప్పింది. అరుదైన ఆపరేషన్‌ను నిర్వహించిన డాక్టర్ కిరణ్‌కుమార్ వైద్య బృందాన్ని సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి అభినందించారు. ఆరోగ్యపరంగా కోలుకోవడంతో మంగళవారం అశోక్‌ను ఆసుపత్రి నుంచి డిశ్చార్జీ చేశారు.

గంటలోనే రిజిస్ట్రేషన్

- మంత్రి అనగాని సత్యప్రసాద్
- కోరిటెపాడులో ఆటోమ్యుటేషన్ పరిశీలన

గుంటూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): గతంలో మాదిరిగా గంటల తరబడి వేచి చూడకుండా.. కార్యాలయానికి వచ్చిన గంటలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నామని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. స్థానిక కోరిటెపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మంగళవారం సందర్శించిన మంత్రి అర్బన్ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్ విధానాన్ని పరిశీలించారు. గుంటూరుకు చెందిన ఆలపాటి సుధాకర్ సతీమణి నాగ లీలావతికి దఖలు దస్తావేజు ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన విధానాన్ని పరిశీలించి, నగరపాలక సంస్థలో పేరు మార్చిన సర్టిఫికెట్‌ను అందజేశారు. కేవలం 15 నిమిషాల 30 సెకండ్లలో స్కాన్, ఈకేవైసీ పూర్తి చేసి ట్రాన్స్‌ఫర్ దస్తావేజులు అందించినట్లు మంత్రి చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 13 నెలల్లో రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖలో అనేక సంస్కరణలు ప్రవేశపెట్టిందన్నారు. ఆటో మ్యుటేషన్ అద్భుతమైన ప్రక్రియ అన్నారు. ప్రభుత్వం సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని సులభతరమైన విధానాలను అవలంబించి తక్కువ సమయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు లక్షా 14 వేల డాక్యుమెంట్లను వినియోగదారులకు పంపిణీ చేసామని, సుమారు ఎనిమిది వేల మ్యారేజ్ సర్టిఫికెట్లను వాట్సప్ ద్వారా పంపినట్లు చెప్పారు. వాట్సప్ ద్వారా ఇంటి వద్దకే డాక్యుమెంట్స్ పంపిస్తున్నామన్నారు. ఎనీవేర్ రిజిస్ట్రేషన్‌లోని లోపాలను సరిదిద్దుతున్నామన్నారు. గత పాలకులు ఎనీవేర్ రిజిస్ట్రేషన్‌పై తీసుకున్న విధానంపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టి విచారణ జరిపిస్తామన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రేషన్ డీఐజీ శ్రీనివాసరావు, జిల్లా రిజిస్ట్రార్ శైలజ, సబ్ రిజిస్ట్రార్ వేంకటేశ్వరరావు, కార్యాలయ సీనియర్ సహాయకులు ధరమ్ తేజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కోరిటెపాడు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆటోమ్యుటేషన్‌ను పరిశీలిస్తున్న మంత్రి అనగాని



కొత్త రూపు దాల్చిన అంబులెన్స్

సంజీవనిగా.. కుయ్..కుయ్..!

- తెలుగు లోగిళ్లను తలపించేలా..
- అంబులెన్స్‌లకు కొత్త రూపు

గుంటూరు మెడికల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అంబులెన్స్‌లు కొత్త రూపు దాల్చాయి. సంజీవని పేరిట కొత్తగా రోడ్లపై పరుగులు పెట్టనున్నాయి. తెలుపు, పసుపు రంగులు మేళవించి.. ఎర్రటి బోర్డర్‌తో తెలుగు లోగిళ్లను తలపించేలా.. సిద్ధం చేశారు. వీటికి రిఫ్లెక్టివ్ టేపులను కూడా అతికించారు. ఈ వాహనాలపై ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఫొటోలను ముద్రిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ వాహనాలకు నీలం రంగు వేశారు. ప్రస్తుతం కృష్ణా జిల్లా బాపులపాడు మండలం మల్లవిల్లి పారిశ్రామికవాడలోని కుశలవ కోచ్‌లో అంబులెన్స్ పనులు వేగంగా సాగుతున్నాయి. ఈ వాహనాల్లో అత్యాధునిక వైద్య పరికరాలను కూడా ఏర్పాటు చేశారు. అతి త్వరలో రాష్ట్రంలోని రోడ్లపై కొత్త సంజీవని అంబులెన్స్‌లు కుయ్ కుయ్‌మని పరుగులు దీయనున్నాయి.

'పల్నాడు', 'సింహాద్రి' ప్రయాణికులు గమనించాలి

- ఈ తేదీల్లో సీసీ బదులు త్రీటైర్ ఏసీ కోచ్ ఏర్పాటు

గుంటూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక కారణాల రీత్యా ఈ నెల 7న 17247 గుంటూరు - వికారబాద్ పల్నాడు ఎక్స్‌ప్రెస్‌ని ఏసీ చైర్‌కార్‌కు బదులుగా త్రీ టైర్ ఏసీ బోగీతో నడపడం జరుగుతుందని డీఆర్‌ఎం సుదేష్ణ సేన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8న గుంటూరు - విశాఖపట్టణం సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌ని కూడా ఏసీ చైర్‌కార్ బదులుగా త్రీటైర్ ఏసీ కోచ్‌తో నడుపుతామమని తెలిపారు. ఈ మార్పు దృష్ట్యా ప్రయాణికులు తమ సీటు నంబర్లు ముందస్తుగా చెక్ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

26, 30 తేదీల్లో ఉదయ్ ఎక్స్‌ప్రెస్ రద్దు

ఈ నెల 26, 30 తేదీల్లో 22876 గుంటూరు - విశాఖపట్నం ఉదయ్ డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్‌ని రద్దు చేసినట్లు డీఆర్‌ఎం తెలిపారు. ఈ విషయాన్ని ప్రయాణికులు గమనించాలన్నారు.

ఉపాధి మేతకు.. కృత్రిమ మేధతో చెక్.!

- దొంగ మస్టర్ల నివారణకు.. ముఖ ఆధారిత హాజరు
- దొంగ పనుల నిరోధానికి సాంకేతిక పరిజ్ఞానం
- కింది స్థాయి సిబ్బందికి డ్వామా అధికారుల శిక్షణ

గుంటూరు సిటీ,ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకానికి తలనొప్పిగా మారిన దొంగ మస్టర్లు, పనులకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. అందుకోసం ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌ను ఉపాధి హామీ పథకానికి జోడించేందుకు సన్నాహాలు చేస్తోంది. అందులో భాగంగా కిందిస్థాయి సిబ్బందికి పూర్తిస్థాయి శిక్షణ ఇచ్చేందుకు ఉమ్మడి గుంటూరు జిల్లాస్థాయిలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. మంగళవారం నుంచి ప్రారంభమైన.. శిక్షణ తరగతుల్లో.. ఎన్ఆర్ఈజీఎస్‌లో పనిచేస్తున్న అన్ని స్థాయిల సిబ్బందిని భాగస్వామ్యం చేస్తున్నారు. డ్వామా పీడీ శంకర్ పాల్గొని, మాట్లాడుతూ.. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ వినియోగం గురించి వివరించారు.

ముఖ ఆధారిత హాజరు మాత్రమే..

ఇక మీదట ఉపాధి హామీ పనులకు హాజరయ్యే ప్రతి కార్మికుని ముఖ ఆధారిత హాజరు తీసుకుంటారు. దాని వల్ల దొంగ మస్టర్లను అరికట్టే అవకాశం ఉంటుంది. ఈ హాజరు ప్రక్రియను ప్రారంభించాడానికి ఉపాధి హామీ కార్మికుల వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపరచనున్నారు. ఈ రికార్డ్ ఆధారంగా ఏఐ పనికిహాజరైన కార్మికుల వివరాలను సరిపోల్చడం జరుగుతుంది. ముఖ ఆధారిత హాజరు వేసే వారికి మాత్రమే ఆ రోజు మస్టర్ పడుతుంది. ఇప్పటి వరకు రాజకీయ నాయకులు, ఉపాధి సిబ్బంది వారికి అనుకూలమైన వారికి పనికి వెళ్లకుండానే మస్టర్లు వేయడం జరుగుతోంది. ముఖ ఆధారిత హాజరు ప్రక్రియ ఆరంభం అయితే దొంగ మస్టర్ల కు చెక్ పడుతుంది.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ శంకర్

దొంగ పనులకు..

దొంగ పనులకు చెక్ పెట్టేందుకు వీలుగా అత్యా ధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకోనున్నారు. జియో ఫెన్సింగ్, ట్యాగింగ్ ప్రవేశ పెడుతున్నారు. ఈ విధానం వల్ల పూర్తి స్థాయిలో జరిగిన పనులకు మాత్రమే బిల్లు చేసే అవకాశం ఉంటుంది.



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డి

విద్యుత్ అంతరాయానికి అధికారులే బాధ్యత వహించాలి

- విద్యుత్ శాఖ సీఎండీ పుల్లారెడ్డి

విజయవాడ సిటీ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): లేన్ల మరమ్మతులు, పాడైన ట్రాన్స్‌ఫార్మర్ల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఏపీ సీపీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పి.పుల్లారెడ్డి హెచ్చరించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలను తగ్గించేందుకు అధికారులు, సిబ్బంది కృషి చేసి వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించాలని సూచించారు. సీపీడీసీఎల్ పరిధిలోని ఎన్టీఆర్, కృష్ణా, సీఆర్డీఏ, గుంటూరు, ప్రకాశం, పల్నాడు, బాపట్ల జిల్లాల అధికారులతో విజయవాడలోని ఎన్టీఆర్ సర్కిల్ కార్యాలయంలో సీఎండీ సమావేశమై దిశానిర్దేశం చేశారు. 33/11 కేవీ సబ్ స్టేషన్స్, సరఫరా లైన్ల అంతరాయాలను తగ్గించాలన్నారు. సిబ్బందిని, సామగ్రిని ముందుగానే సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. చెడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లను, మీటర్లను వెంటనే మార్చాలని ఆదేశించారు. సరఫరాకు అంతరాయం ఏర్పడే గణాంకాలు ఫీడర్ల వారీగా తన వద్ద ఉన్నాయని సీఎండీ తెలిపారు. రైతులకు నూతన విద్యుత్ కనెక్షన్‌లు తక్షణమే మంజూరు చేయాలని ఆదేశించారు. పీఎం సూర్యఘర్ పథకం ప్రయోజనాలను ఎస్సీ, ఎస్టీ గృహ సబ్సిడీ వివరాలను వినియోగదారులకు వివరించి, సోలార్ ప్యానెల్‌లు ఏర్పాటుకు లబ్ధిదారుల సమ్మతి లేఖ తీసుకోవాలన్నారు. ఆర్‌డీఎస్ఎస్ పథకంలో మంజూరైన మండల ప్రాంతాల్లో 33 కేవీ, 11 కేవీ వ్యవసాయ ఫీడర్లను విభజించే పనులు త్వరగా పూర్తి చేసి ఆయా ప్రాంతాలకు 24 గంటల నిరంతర 3-ఫేస్ విద్యుత్ సరఫరా అందించాలని ఆదేశించారు. టెక్నికల్ డైరెక్టర్ మురళీకృష్ణ యాదవ్, ప్రాజెక్ట్స్ డైరెక్టర్ కేవీఎస్ఎన్ మూర్తి, ఫైనాన్స్ డైరెక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, ఎస్ఈ తోట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

లక్షణంగా..నిర్వహణ సాగేలా!

- పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్వహణకు నిధులు
- ఒక్కో కేంద్రానికి రూ.లక్ష విడుదల
- గతంలో నిధులు దారిమళ్లించిన వైసీపీ

సత్తెనపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. ఈ నేపథ్యంలో వాటి సేవలను మరింత బాలోపేతం చేయాలని ప్రభుత్వాలు నిర్ణయం తీసుకున్నాయి. లక్ష్యం మేరకు.. వాటి సేవలు అందించడం లేదని గుర్తించి, వాటిని ప్రజలకు చేరువ చేయాలనే.. ఆర్థిక భరోసా కల్పించే లక్ష్యంతో చర్యలు చేపట్టాయి. ఒక్కో ప్టటణ ఆరోగ్య కేంద్రానికి.. నిర్వహణ నిమిత్తం ఏడాదికి లక్ష రూపాయలు చొప్పున జాతీయ ఆరోగ్య మిషన్ నుంచి కేంద్ర ప్రభుత్వం నిధులను విడుదల చేసింది. సత్తెనపల్లి పట్టణంలో మూడు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. ఇక్కడ డాక్టర్లతో పాటు ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మాసిస్టు, స్టాఫ్ నర్సులు, డేటా ఎంట్రీ ఆపరేటర్, ఆరోగ్య కార్యకర్తల సేవలు అందుబాటులో ఉన్నాయి.

దారి మళ్లించిన వైసీపీ ప్రభుత్వం

వైసీపీ ప్రభుత్వ హయాంలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్వహణ, మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు కేటాయించిన దాఖలాలు లేవు. జాతీయ ఆరోగ్య మిషన్ నుంచి మంజూరైన నిధులను ఇతర అవసరాలకు మళ్లించారు. గతంలో నిర్వహణకు రూ.33వేలు చొప్పున అందజేశారు. ఆ నిధులతో ప్రజలకు సేవలు అందించడం కష్టమే. పారిశుధ్యం, స్టేషనరి, విద్యుత్ బిల్లుల చెల్లింపు, ఆస్పత్రి నిర్వహణకు వినియోగించుకొనేలా.. లక్ష రూపాయల చొప్పున ప్రస్తుతం మంజూరు చేశారు. ప్రతి పైసా సక్రమంగా ఖర్చు అయ్యేలా కమిటీలు ఏర్పాటు చేసి, పర్యవేక్షించనున్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో అన్ని రకాల ఔషధాలు అందుబాటులో ఉంచి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టనున్నారు. తద్వారా పట్టణ ప్రాంత వాసులకు మంచి వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి.



పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం